# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :279 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 16-01-2025 | పేజీలు:4 వెల: 2.00


## న్యూ ఢిల్లీ స్థానానికి నామినేషన్ వేసిన అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ, వచ్చే నెల 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఎన్నికలకు సంబంధించి ఈ నెల 10న నోటిఫికేషన్ విడుదల కాగా.. 17వ తేదీ వరకు నామినేషన్‌లకు అవకాశం కల్పించారు. ఇక గడువు సమీపిస్తుండటంతో రాజధానిలో నామినేషన్‌లు జోరందుకున్నాయి. ఇప్పటికే కల్కాజీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఢిల్లీ సీఎం అతిశీ నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నామినేషన్ దాఖలు చేశారు.కేజ్రీవాల్ న్యూ ఢిల్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇవాళ నామినేషన్ దాఖలు చేశారు. ఇవాళ ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి కన్నాట్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రిటర్నింగ్ ఆఫీస్‌కు ర్యాలీగా వెళ్లి.. అక్కడ నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ ఆఫీసర్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కాగా ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుంది.

## కెటిఆర్‌కు సుప్రీంలో చుక్కెదురు..



న్యూఢిల్లీ,జనవరి15:మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఫార్ములా–ఈ కారు రేసుకు సంబంధించిన కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. ఏసీబీ నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలని తెలంగాణ హైకోర్టులో కేటీఆర్ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. ఇందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీంతో ఈ నెల 8న ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. కేటీఆర్ పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న వ్లగ్గ÷ ధర్మాసనం విచారణ జరిపింది. దీంతో ఆయనకు ఇక ఎసిబి విచారణ తప్పదు. అలాగే అరెస్ట్ చేయడం కూడా ఖాయమని అంటున్నారు. రాజకీయ కారణాలతోనే కేసు నమోదు చేశారని.. ప్రస్తుతం కేటీఆర్ విపక్షంలో ఉన్నారని ఆయన తరఫు న్యాయవాది సుందరం సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష నేతగా ఉండటంతోనే కేసులు పెడుతున్నారని వాదించారు. అయితే.. ప్రతిపక్ష నేతగా ఉంటే కేసులు ఎదుర్కోవాలి కదా..? అని జస్టిస్ బేలా ఎం త్రివేది ప్రశ్నించారు. హైకోర్టు తీర్పులో తాము జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. పిటిషన్ వెనక్కి తీసుకుని.. మళ్లీ హైకోర్టును ఆశ్రయించేందుకు అవకాశం ఇవ్వాలని కేటీఆర్ తరఫు న్యాయవాది కోరారు. పిటిషన్ విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పించిన ధర్మాసనం.. మళ్లీ హైకోర్టుకు వెళ్లే స్వేచ్ఛ ఇవ్వలేమని స్పష్టం చేసింది. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. విచారణలో భాగంగా కేటీఆర్ తరపున న్యాయవాది సిదార్థ వాదనలు వినిపించారు. ఈ ఫార్ములా కారు రేసు కేసులో హెచ్‌ఎండీఏను, ఇతరులను పేర్కొనలేదని కేవలం ఇద్దరు అధికారులను, కేటీఆర్‌ను మాత్రమే నిందితులుగా చేర్చారని కోర్టు ముందు ప్రస్తావించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపు కేసు అని.. కేటీఆర్ ఒక్క రూపాయి తీసుకున్నారని ఎవరూ చెప్పడం లేదని న్యాయవాది తెలిపారు. ఇలాంటప్పుడు అవినీతి నిరోధక చట్టంలోని 13(1)ఏ ఎలా వర్తిస్తుందని.. ఇందులో పీసీ యాక్ట్ 13(1ఎ) వర్తించనే వర్తించదని కేటీఆర్ తరపు న్యాయవాది వాదించారు. వెంటనే జోక్యం చేసుకున్న జస్టిస్ బేలా త్రివేది.. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఎలాంటి జోక్యం చేసుకోబోమని స్పష్టం చేశారు. దీంతో ఈ కేసుకు సంబంధించి సుప్రీం కోర్టులో కాస్త ఊరట లభిస్తుందని భావించిన కేటీఆర్‌కు ఎదురుదెబ్బే తగిలింది. సుప్రీం నిర్ణయంతో ఈ కేసులో ఏసీబీకి మరింత దూకుడు పెంచే అవకాశం ఉంది. అయితే కేటీఆర్ కంటే ముందే రాష్ట్ర ప్రభుత్వం కూడా సుప్రీంలో కేవియట్ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఒకవేళ కేటీఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయిస్తే.. విచారణ సందర్భంగా ముందు తమ వాదనలు వినాలని తెలంగాణ ప్రభుత్వం కేవియట్ పిటిషన్‌ను ముందస్తుగానే దాఖలు చేసింది. హైకోర్టులో క్వాష్ పిటిషన్ నిరాకరణకు గురైనప్పటికీ.. సుప్రీం స్టే విధిస్తుందని కేటీఆర్ భావించినట్లు తెలుస్తోంది. కానీ హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌లో తాము జోక్యం చేసుకునేది లేదని సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పడంతో ఏసీబీ మరోసారి నోటీసులు ఇస్తే ఆ విచారణకు కేటీఆర్ ఖచ్చితంగా హాజరుకావాల్సి ఉంటుంది. గతంలో ఈ కేసుకు సంబంధించి కేటీఆర్‌ను దాదాపు ఎనిమిది గంటల పాటు ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుప్రీం కోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ అయిన నేపథ్యంలో.. మాజీ మంత్రి అరెస్ట్ తప్పదనే వార్తలు వినిపిస్తున్నాయి. కాగా.. ఈ కేసుకు సంబంధించి ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌తో పాటు, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్‌ను ఈడీ, ఏసీబీ అధికారులు విచారించిన విషయం తెలిసిందే. వీరి నుంచి పలు కీలక సమాచారాన్ని ఏసీబీ, ఈడీ అధికారులు రాబట్టినట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు మరోసారి నోటీసులు ఇచ్చేందుకు ఏసీబీ సిద్ధమైంది. ఆయనతోపాటు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు మరో సారి నోటీసులు ఇచ్చే యోచనలో ఉంది. సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కావడంతో నోటీసులపై ఏసీబీ ముందుకెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ ముగ్గురిని ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే.

## మోహన్ భగవత్ వ్యాఖ్యలు దేశద్రోహం కిందకే వస్తాయి...



న్యూఢిల్లీ,జనవరి15: అయోధ్యలో రామమందిరం ప్రతిష్ఠాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందిందని ఆర్‌ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. వీటిని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. తాజాగా ఆ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. భాగవత్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకే వస్తాయని అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. దీనికి ఇందిరాభవన్ గా నామకరణం చేశారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఆర్‌ఎస్ఎస్ చీఫ్‌పై ధ్వజమెత్తారు. 'దేశంలో రెండు సిద్ధాంతాల మధ్య యుద్ధం జరుగుతోంది. ఒకటి మా రాజ్యాంగ సిద్ధాంతం, మరొకటి ఆర్ఎస్ఎస్ భావజాలం. 1947లో దేశానికి స్వాతంత్ర్యం రాలేదంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ దేశ ప్రజలందరినీ అవమానించారు. బ్రిటీష్ వారిపై పోరాడిన యోధులందరినీ ఆయన కించపరిచారు. ఆయన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకే వస్తాయి. ఇకనైనా ఇలాంటి పిచ్చి మాటలు వినడం ఆపాలి' అని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ నేతలు తమ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారని ఆయన ఈసందర్భంగా గుర్తుచేశారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేవారిని ఆపగలిగేది తమ పార్టీ మాత్రమేనని అన్నారు. తమ పోరాటంలో న్యాయం ఉందని, దాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ తీరుపైనా రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే అసెంబ్లీ ఎన్నికల సమయానికి మహారాష్ట్రలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. దానికి సంబంధించిన సమాచారం ఇచ్చేందుకు ఈసీ నిరాకరిస్తోంది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడం ఈసీ బాధ్యత. మన ఎన్నికల వ్యవస్థలో తీవ్రమైన సమస్యలు ఉన్నాయని రాహుల్ ఆరోపించారు. అనంతరం నూతన ప్రధాన కార్యాలయం గురించి స్పందిస్తూ.. ఈ కొత్త భవనం కాంగ్రెస్ కార్యకర్తల రక్తంతో రూపుదిద్దుకుంది. ఇది ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు చెందుతుందని పేర్కొన్నారు. ఏఐసీసీ నూతన కార్యాలయం ప్రారంభమైంది. బుధవారం ఉదయం పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నూతన భవనంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ భవానానికి ఇందిరాభవన్‌గా నామాకరణం చేశారు. నూతన కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ, కెవెస్ వేణుగోపాల్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం 1947లో రాలేదని, రామ్ మందిర్ నిర్మాణం జరిగినప్పుడే వచ్చిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారని, దేశంలో రెండు భావజాలాలు ఉన్నాయని, అందులో ఒకటి రాజ్యాంగబద్ధమైన భావజాలం తమదని, మరొకటి ఆర్ఎస్ఎస్ భావజాలమని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ భావజాలంలో పెద్ద, చిన్న కులాలు, తర తమ బేధాలు ఉండవని, రాజ్యాంగంలో అదే రాసి ఉందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్‌లో పూర్తిగా కేంద్రీకృతమైన విధానాలు, నిర్ణయాలు ఉంటాయన్నారు. మోహన్ భగవత్ రాజ్యాంగం చెల్లుబాటు కాదని చెబుతున్నారని, బ్రిటీష్ మీద జరిగిన పోరాటాన్ని గుర్తించడం లేదని విమర్శించారు. వారికి త్రివర్ణ పతాకంపై గౌరవం లేదని, రాజ్యాంగ విలువలపై నమ్మకం లేదని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడే ఏకైక పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీయేనని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ భావజాలం ఇవాల్టిదో.. నిన్నటిదో కాదని.. వేల సంవత్సరాల ఆర్ఎస్ఎస్ ఐడియాలజీని వ్యతిరేకిస్తూ వేల ఏళ్లుగా మా ఐడియాలజీ కొనసాగుతూ వచ్చిందని అన్నారు. గురునానక్, గౌతమ బుద్ధుడు, కృష్ణుడు.. వీళ్లంతా ఆర్ఎస్ఎస్ ఐడియాలజీనా.. అని ప్రశ్నించారు. ఈ కొత్త భవనం కాంగ్రెస్ భావజాలానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ భవనంలో ఉన్న అందరూ ఆ భావజాలాన్ని కాపాడేవారేనని.. బీజేపీకి లొంగిపోయేవారు కాదని అన్నారు. ఈ భవంతి బయట మిలియన్ల కొద్దీ ప్రజలు మన భావజాలానికి మద్దతుగా ఉన్నారని, ఈ భావజాలం దేశం నలుమూలలకు మరింతగా విస్తరించాలని రాహుల్ గాంధీ పిలుపిచ్చారు. ఆ తర్వాత ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నూతన ప్రధాన కార్యాలయం గురించి స్పందిస్తూ.. ఈ కొత్త భవనం పార్టీ కార్యకర్తల రక్తంతో రూపుదిద్దుకుంది అన్నారు.. ఇది ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు చెందుతుంది అని రాహుల్ గాంధీ వెల్లడించారు.

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు విధించకుండా అమలు చేయాలి



సిద్ధిపేట : ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు విధించకుండా అమలు చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. వర్చువల్‌గా నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 50 లక్షల ఈజీఎస్ కార్డులు ఉంటే కోటి రెండు లక్షల మంది ఉపాధి హామీ కూలీలుగా పనిచేస్తున్నారని వీరంతా కూలీ పనికి వెళ్లే నిరుపేదలు అని తెలిపారు. ఎస్సీ ఎస్టీ, బీసీ రైతుల ఎక్కువగా ఉంటారు. రాష్ట్రంలో కోటి 2 లక్షల మంది వ్యవసాయ కూలీలు ఈ కార్డుల ద్వారా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నారు.గుంట భూమి ఉన్న రైతులను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించం అని ప్రభుత్వం చెప్పడం దురదృష్ట కరమన్నారు. ఒక్క సెంటు భూమి ఉన్నా కూలీ కాదు అని అంటున్నారు. ఉపాధి హామీ పథకంలో ఈ సంవత్సరం 20 రోజులు పని దినాలు ఉంటేనే కూలీగా గుర్తింపు ఉంటుందనే నిబంధన కూడా సరైంది కాదన్నారు. అనారోగ్య సమస్యలతోనూ ఇతర సమస్యలతోనూ పనికి వెళ్లని కూలీలను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించరు అని ప్రభుత్వం చెప్తున్నది. ఈ నిర్ణయాన్ని కూడా ప్రభుత్వం మార్చి రైతు కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇస్తున్నది రూ.1500..ఎగ్గొట్టేది రూ. 12 వేలు

ఐదు గుంటలు ఉన్న రైతుకు సంవత్సరానికి రైతు భరోసా కింద రూ.1500 మాత్రమే వస్తాయి. ఐదు గుంటలు ఉన్న రైతుకు వ్యవసాయ కూలీ కింద రూ.12000 ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద నష్టపోతారని పేర్కొన్నారు. ముఖ్యంగా దళితులు, గిరిజనులు.. తాతకు ఎకరం భూమి ఉంటే పిల్లలు పంచుకుంటే అది ఐదు గుంటలు వస్తాయి. 5 గుంటలో పంట పండింది లేదు, వారు బతికింది లేదు. 5 గుంటలు ఉన్నందుకు 12 వేల రూపాయలు ఇవ్వం అని ప్రభుత్వం చెప్పడం శోచనీయమన్నారు. రైతు భరోసా కింద మీరు ఇస్తున్నది రూ.1500 అయితే ఎగ్గొట్టేది 12 వేల రూపాయలు.రాష్ట్రంలో ఎకరం లోపు భూమి ఉన్న రైతులు 24 లక్షల 57,000 మంది ఉన్నారు. గుంట, రెండు గుంటలు ఉన్న రైతులు రైతు భరోసా తీసుకోవడం వల్ల రైతు కూలీలకు ఇచ్చే రూ.12,000 నష్టపోతారు. కావున ఇలాంటి రైతులకు రైతు భరోసా కాకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులుగా గుర్తించాలని ఆయన సూచించారు. ఈజీఎస్ పథకంలో కూలీలు 60 సంవత్సరాల వయసు దాటితే కార్డు కోల్పోతారు. కాబట్టి ఈ పథకంలో ఈజీఎస్ నిబంధన విధించకుండా అమలు చేయాలన్నారు.

గ్రామ సభల ద్వారానే ఎంపిక..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలు ప్రకటించాలి.నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్టు ప్రభుత్వం చెప్పింది. కానీ లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలు విడుదల చేయలేదని విమర్శిం చారు. సిద్దిపేట జిల్లాలో 68 వేల దరఖాస్తులు వచ్చాయి. డోర్ టు డోర్ సర్వేలో మిగిలిన ఇళ్లను జిల్లా ఇంచార్జ్ మంత్రి ఫైనల్ చేస్తారు అని పత్రికల్లో వార్తలు వచ్చాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ సభలు పెట్టి అసలైన లబ్ధిదారులను ఎంపిక చేసేది.అసలైన లబ్ధిదారులకు న్యాయం జరగాలంటే గ్రామసభలు పెట్టి లబ్ధిదారులను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇల్లు మంజూరై అయిన వారు కొంత నిర్మించుకొని ఉన్నారు. ఇలాంటి ఇళ్లను పూర్తి చేసుకోడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరుతున్నాం. అందరూ పేదవారే కాబట్టి వెంటనే నిధులు విడుదల చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలన్నారు.

## ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో సందడే సందడి




ప్రయాగ్‌రాజ్,జనవరి15: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వేదికగా ప్రారంభమైన 'మహా కుంభమేళా' కు భక్తులు పోటెత్తుతున్నారు. ఉత్తరాయణ పుణ్యకాలంతో భక్తులు భారీగా తరలిచ్చారు. మంగళవారం మకర సంక్రాంతి పురస్కరించుకుని వివిధ అఖాడాల నుంచి వేలాదిగా వచ్చిన సాధువులు తొలి పుణ్య స్నానాలు ఆచరించారు. తెల్లవారుజామునే 3 గంటల సమయంలో బ్రహ్మ ముహూర్తంలో పుణ్యస్నానాలు ప్రారంభమయ్యాయి. నేడు ఒక్కరోజే దాదాపు 3.5 కోట్ల మంది భక్తులు త్రివేణి సంగమానికి తరలివచ్చినట్లు యూపీ ప్రభుత్వం వెల్లడించింది. కుంభమేళా సమయంలో పుణ్యస్నానాలకు ప్రత్యేక స్థానముంది. పెద్ద సంఖ్యలో వివిధ అఖాడాల నుంచి సాధువులు తరలి వచ్చి సామూహిక స్నానాలు ఆచరిస్తారు. కేవలం కుంభమేళా సమయంలోనే వారు దర్శనమిస్తారు. ఈ క్రమంలోనే మంగళవారం ఒంటినిండా భస్మాన్ని పూసుకుని ఈటెలు, త్రిశూలాలు చేతపట్టుకుని దమరుక నాదాల నడుమ వేలమంది నాగ సాధువులు ఊరేగింపుగా పుణ్యస్నానాలకు తరలివచ్చారు. తొలుత పంచాయతీ అఖాడా మహానిర్వాణీ, శంభు పంచాయతీ అటల్ అఖాడాకు చెందిన సాధువులు స్నానమాచరించారు. మహా కుంభమేళాలో 13 అఖాడాలు పాల్గొంటున్నాయి. మరోవైపు.. హెలికాప్టర్ల ద్వారా భక్తులపై పూలవర్షం కురిపించారు.మకర సంక్రాంతి సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించిన సాధువులు, భక్తులకు ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు. అదేవిధంగా ఈ కార్యక్రమాలు విజయవంతం గా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్న యంత్రాంగానికి కృతజ్ఞతలు చెప్పారు. అయితే, మహా కుంభమేళా ఏర్పాట్లపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పెదవి విరిచారు. భారీ ఎత్తున ఏర్పాట్లు చేశామని ప్రభుత్వం చెబుతున్న మాటలు వాస్తవానికి దూరంగా ఉన్నాయని విమర్శించారు. తాగునీరు, ఆహారం, వసతి వంటి కనీస సౌకర్యాల కోసం భక్తులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

## చంద్రబాబుకు సుప్రీం కోర్టులో భారీ ఊరట



న్యూఢిల్లీ,జనవరి15: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. స్కిల్ కేసులో బెయిల్ రద్దు చేయాలని గత ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బేలా త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. ఈ కేసులో ఇప్పటికే చార్జిషీట్ ÷ల్ చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ రద్దు పిటిషన్‌లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని జస్టిస్ బేలా త్రివేది వెల్లడించారు. 2023 నవంబర్‌లో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే బెయిల్‌ను రద్దు చేయాలంటూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో పిటిషన్ వేసింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఈరోజు ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. అవసరం అయిన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సుప్రీం కోర్టు సూచించింది. అయితే ఈ కేసులో ఏపీ హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని జర్నలిస్టు ఇంప్లీడ్ పిటిషన్ వేయగా.. దాన్ని కొట్టివేస్తూ జర్నలిస్టుపై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. 'అసలు ఈ కేసుకు మీకు సంబంధం ఏంటి... మీరెందుకు ఇందులో జోక్యం చేసుకున్నారు' అంటూ జర్నలిస్టును కోర్టు మందలించింది. స్కిల్ కేసులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సుప్రీం కోర్టు సమర్థించింది. ఆ బెయిల్‌ను రద్దు చేసేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. కాగా.. ఏపీ స్కిల్ కేసుకు సంబంధించి గత ప్రభుత్వం మాజీ సీఎం హోదాలో ఉన్న చంద్రబాబుపై అక్రమ కేసు బనాయించి జైలుకు కూడా పంపించిన విషయం తెలిసిందే. ఆనాటి నుంచి కేసు విచారణ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి గతంలో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలంటూ గత వైసీపీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సుప్రీంలో వాదనలు జరుగాయి. స్కిల్ కేసులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరిగిందని అప్పటి సర్కార్ పేర్కొనలేదు. కావాలని కుట్ర పూరితంగా రాజకీయ కక్షలో భాగంగా చంద్రబాబుపై అవినీతి కేసును మోపింది. అక్రమ కేసును పెట్టి మరీ చంద్రబాబును జైలుకు తరలించారు. ఇదే పిటిషన్‌ను విచారణ జరిపిన ఏపీ హైకోర్టు.. నాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంలో గత వైసీపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను తాజాగా సుప్రీం కోర్టు కొట్టివేసింది.

## మాజీ సీఎం యడ్యూరప్ప బెయిల్‌ను పొడిగించిన కర్ణాటక హైకోర్ట్



బెంగళూర్ :తనపై నమోదైన పోక్సో కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను కర్ణాటక హైకోర్టు వాయిదా వేసింది.జస్టిస్ ఎం నాగప్రసన్న ముందు సీఐడీ తరపున సీనియర్ న్యాయవాది రవివర్మ కుమార్ వాదనలు వినిపించడంతో పాటు సంఘటనకు సంబంధించిన వీడియో, ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ నివేదికతో సహా కీలకమైన సాక్ష్యాలను సమర్పించారు. ఇక, ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ నివేదిక ప్రకారం.. యడ్యూరప్ప వాయిస్ శాంపిల్ సాక్ష్యంలోని ఆడియోతో పాటు వీడియో సాక్ష్యాలను గుజరాత్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ధృవీకరించింది.. అది తారుమారు చేయబడలేదని సీఐడీ తరపు లాయర్ తెలిపారు.ఇక, మరోవైపు, సెక్షన్ 161 కింద నమోదు చేయబడిన సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా కేసును కొట్టివేయలాని సీనియర్ న్యాయవాది వాదించారు. ఇది పోలీసులు నేరం గురించి సమాచారాన్ని అందించగల వ్యక్తులను పరిశీలించడానికి అనుమతిస్తుంది అన్నారు. తన వాదనలకు మద్దతుగా సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరణగా తీసుకున్నారు. ఇక, కేసు ఆలస్యం కావడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ తన వాదనలను ముగించారు యడ్యూరప్ప తరపు న్యాయవాది. ఇక, ఇరువురు వాదనలు విన్న కర్ణాటక హైకోర్టు తదుపరి విచారణను జనవరి 17వ తేదీకి వాయిదా వేసింది. యడ్యూరప్పకు బెయిల్ మంజూరు చేస్తూ ట్రయల్ కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది.

సంపాదకీయం

గురువారం 16-01-2025

## జాతిని జాగృతం చేసిన స్వామి వివేకానంద !

భారతదేశాన్ని జాగృతము చెయ్యడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండులలో యోగ, వేదాంత శాస్త్రములను తన ఉపన్యాసముల ద్వారా, వాదనల ద్వారా పరిచయం చేసిన ఖ్యాతి స్వామి వివేకానందది. ఆయన ఎప్పుడూ యువతను మేల్కొల్పుతూనే ఉంటారు. ముఖ్యంగా యువతకోసం ఆయన ఎంతో తపించారు. భారతదేశ భవిష్యత్తు ని మార్చగలిగేది యువతేనని ఆయన అనేవారు. యువత ఒక మంచి ఆశయంతో ముందుకు వెళ్లాలని ఆయన అనేవారు. అందుకే 'డబ్బు లేని వాడు కాదు జీవితంలో ఒక ఆశయం అంటూ లేని వాడు అసలైన పేదవాడు అంటారు'వివేకానంద. ఆయన ఎప్పుడు కూడా 'గొర్రెలలా కాదు సింహంలా ధైర్యంగా బ్రతకమని' దేనికి భయపడవద్దని అంటారు. 'ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన కొంతమంది యువకులను నాకు అప్పగిస్తే ఈ దేశం స్వరూపాన్నే మార్చేస్తాను' అని స్వామీజీ తరచూ అనేవారు. మన దేశంలో యువత మనసులో స్ఫూర్తి నింపినవారిలో వివేకానంద అంతటి వారు మరొకరు లేరు. అందుకే మన దేశంలో ఆయన పుట్టినరోజు జనవరి 12 ను 'నేషనల్ యూత్ డే' గా జరుపుకుంటారు. ఆయన తన ప్రసంగాలతో, సూక్తులతో పుస్తకాలతో, యువతరాన్ని ఉత్తేజపరిచి, దిశానిర్దేశం చేశారు. జీవితం నిరాశ నిస్పృహలతో నిండిపోయినప్పుడు, భయ భ్రాంతులకు గురైనప్పుడు, మనసు చెడు మార్గాలవైపు మళ్ళి ఏమిచెయ్యాలో దిక్కు తోచని పరిస్థితులలో ఉన్నప్పుడు ఒక్కసారి స్వామి వివేకానందకి సంబంధించిన పుస్తకాలు, సూక్తులను చదవండి. వివేకానందుని సందేశాలు సూటిగా మన హృదయాన్ని తాకుతాయి. మనసులో ఒక తెలియని ధైర్యం, ఆలోచనలో మార్పు కలుగు తుంది. జీవితానికి అసలైన అర్థం తెలుస్తుంది. నిద్రాణమై ఉన్న భారత జాతిని మేల్కొలిపిన ఆ మహనీయుడు, యుగ పురుషుడు ఎప్పటికి మన గుండెల్లో నిలిచే ఉంటారు. అమెరికాకు వెళ్ళి అక్కడ హిందూ మత ప్రాశస్త్యం గురించి ఎన్నో ఉపన్యాసాలు చేయడం ద్వారా భారత కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానంద. యువత తమ తెలివితేటలతో ఆధునిక భారత నిర్మాణానికి పూనుకోవడం ద్వారానే ఆయనకు నివాళి అర్పించగలరు.. భారతదేశాన్ని ప్రేమించి, భారతదేశం మళ్ళీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానంద. అతని వాగ్ధాటికి ముగ్ధులైన అమెరికా ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. ఎంతో మంది అతనికి శిష్యులయ్యారు. పాశ్చాత్య దేశాలలోకి అడుగు పెట్టిన మొదటి హిందూ సన్యాసి ఆయనే. తూర్పు దేశాల తత్త్వమును షికాగోలో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మేళనంలో 1893 లో ప్రవేశపెట్టాడు. అక్కడే షికాగోలోను, అమెరికాలోని ఇతర ప్రాంతాలలోను ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. తిరిగి భారత దేశం వచ్చిన వివేకానంద రామకృష్ణ మఠాన్ని స్థాపించి దీని ద్వారా భారత యువతకు దిశా నిర్దేశం చేశాడు. ఇంతటి ఘనత సాధించిన స్వామి వివేకానంద కేవలం ముప్పై తొమ్మిది ఏళ్ళ వయసు లోనే మరణించాడు. అతను చేసిన సేవలకు గుర్తింపుగా 1984లో భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని 'జాతీయ యువజన దినోత్సవం'గా ప్రకటించింది. వివేకానందుడు తన సందేశంలో భారతదేశ మత సామరస్యాన్ని గురించి, వైవిధ్యాన్ని గురించి వివరించాడు. ప్రాచీన కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో దాడులు ఎదుర్కొన్న నుంచి ఇజ్రాయెలీలు, పార్సీలు వంటివారిని స్వీకరించి హృదయాలకు హత్తుకున్న భారతదేశానికి చెందినవాడినని గర్విస్తున్నానన్నాడు. వివిధ మార్గాల ద్వారా సాగిన మానవులంతా భగవంతుణ్ణి చేరుకుంటారని చెప్పే హిందూ సూక్తులను, భగవద్గీత శ్లోకాన్ని ప్రస్తావించాడు. చారిత్రకంగా ఎన్నో నాగరికతలు, దేశాలను నాశనం చేసిన మూఢభక్తి, మతతత్వాలను సర్వమత సమ్మేళనం దూరం చేస్తుందని విశ్వసిస్తున్నట్టు చెప్పాడు. తరవాత రామకృష్ణ పరమహంస సాహచర్యలో జీవితం గడిపాడు. రామకృష్ణ పరమహంస నుంచి నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నాడు. అలా చదువుకుంటూనే మెల్లగా సన్యాస మార్గంలోకి నడిచాడు. కుటుంబ కష్టాలను ఈదుస్తున్న సమయంలోనే 1886లో రామకృష్ణ పరమహంస మరణించారు. రామకృష్ణులవారు చనిపోయిన తరువాత ఆయన శిష్యులందరూ కలిసి ఒక మఠాన్ని ఏర్పాటు చేసుకుని అందులో ఉండేవారు. వాళ్ళకి నరేంద్రుడు నాయకుడిగా ఉండేవారు. కొంతకాలం తరువాత వివేకానంద దేశమంతటా పర్యటించాలనుకున్నారు. భారతదేశమంతటా ప్రయాణించి భారతీయుల స్థితిగతులను ప్రత్యక్షంగా చూసారు.ఆ సమయంలో పేదవాళ్ళ పరిస్థితి చూసి చలించి పోయారు. భారత దేశం బానిసత్వంలో మగ్గిపోవడానికి, మూఢనమ్మకాలే కారణమని గుర్తించారు. భారతదేశంలోని వివిధ మతాలను వాటి తత్వాలలను అర్థం చేసుకున్నారు. భారతీయ ఆద్యాత్మిక సందేశాన్ని ఇతర దేశాలకు అందించాలనుకున్నారు. అలా దేశమంతా పర్యటిస్తూ చివరికి కన్యాకుమారి చేరుకున్నారు. అక్కడ సముద్రంలో కొంత దూరంలో కనపడుతున్న ఒక చిన్న కొండ లాంటి ప్రదేశానికి ఈదుకుంటూ వెళ్లి అక్కడ మూడు రోజుల పాటు ధ్యానం చేసారు. ఆ ధ్యానంలో తాను ఇన్ని రోజుల నుండి చుసిన వాటిని స్పష్టంగా అర్థం చేసుకున్నారు. పాశాత్య దేశాలకు వెళ్లి భారతదేశపు గొప్పతన్నాని చాటాలని అలాగే తిరిగి వచ్చిన తరువాత నిరాశ నిస్పృహలతో నిండిపోయిన భారతీయులను మేల్కొలపాలని నిర్ణయించు కున్నారు. అయితే చికాగో లో జరగబోయే సర్వమత మహా సభలకు వెళ్లాలని, అక్కడ భారతదేశ గొప్పతన్నాని, ఆధ్యాత్మికను చాటి చెప్పాలనుకున్నారు. అలా షికాగో ద్వారా భారత ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటారు. 1893 సంవత్సరం సెప్టెంబర్ 11 న తేదీన ప్రారంభమయ్యాయి. ఇతర మతాలకు చెందిన గొప్ప గొప్ప వాళ్ళందరూ.. సూటు బూట్లతో రెడీ అయ్యి ఉంటారు. కానీ వివేకానంద దుస్తులు, వేషధారణ చూసి ఆయన్ని ఎవరూ కూడా గౌరవించలేదు. చులకనగా చూస్తారు. సభలో ఒక్కొక్కరుగా లేచి వాళ్ళ మతాల గొప్పతనం గురించి మాట్లాడుతుంటారు. చివరగా స్వామి వివేకానంద వంతు రానే వచ్చింది. స్వామిజి నిల్చుని గంభీరమైన గొంతుతో 'అమెరికా దేశపు సోదర సోదరీ మణులారా' అని పలకరించే సరికి ఆ ఒక్క పిలుపికి సభలో ఉన్న 4000 మందికి పైగా జనం లేచి 2 నిమిషాల పాటు ఆగకుండా చప్పట్లు కొట్టారట. అప్పటి వరకు అందరు 'లేడీస్ అండ్ జెంటిల్ మెన్' అంటూ స్పీచ్ మొదలు పెట్టారు కానీ వివేకానంద సోదర సోదరీమణులారా అని పలకరించేసరికి ఆ పిలుపులో ఆత్మీయత వాళ్ళ హృదయాలను తాకింది. ఏ స్వార్థం లేని పిలుపుకి కొంతమంది కన్నీరు కూడా కార్చారు. ఆ చప్పట్ల శబ్దం ఆగిన తరువాత ఆయన భారతదేశ గొప్పతనం గురించి మన దేశంలో ఆధ్యాత్మికత, సనాతన దర్మం, సంస్కృతి, సంప్రదాయాల గురించి ప్రసంగించారు. దానితో సభ మొత్తం చప్పట్లతో మారుమోగిపోయింది. సభలో ఉన్న మేధావులు, గొప్ప గొప్ప వాళ్లంతా తమ స్థాయిని కూడా మర్చిపోయి చిన్న పిల్లల్లా ఎగబడుతూ స్టేజి వద్దకు వచ్చి స్వామిజీకి షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. అప్పటి వరకు భారత దేశం అంటే, మూఢ నమ్మకాలతో, చెట్లకు పుట్లకు పూజలు చేసే ఒక అనాగరికమైన దేశం అనే భావన ఉన్న వాళ్లందరికీ భారత దేశం పట్ల ఉన్న అపోహలను తొలగించారు. గౌరవం కలిగేలా చేసారు. భారత దేశపు స్థాయిని పెంచారు.

## కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ప్రజాక్షేత్రానికి ఎందుకు దూరంగా ఉంటున్నారు..

అమరావతి, తెలుగు రాష్ట్రాల్లో ఆ లీడర్ స్టైలే వేరు. తనకంటూ కొంత ఫాలోయింగ్ ఉన్న ఆ నేత.. తన నియోజకవర్గంలో ఒక పవర్ ఫుల్ లీడర్గా ఎదిగారు. అధికారంలో ఉన్నప్పుడు నిత్యం లైమ్‌లైట్‌లో ఉంటూ వచ్చారు. పార్టీకి పవర్ పోయింది.. ఆయన ఎమ్మెల్యేగా ఓడిపోయారు. ఆ తర్వాత ఆ నేత అంతర్మథనంలో పడిపోయారట. అందుకే అప్పుడప్పుడు సోషల్ మీడియా పోస్ట్‌లు తప్ప..నియోజకవర్గంలో మాత్రం యాక్టీవ్ కావడం లేదంటున్నారు. ఆ మాజీ ఎమ్మెల్యే మౌనం వెనుక వైరాగ్యం ఉందా? లేక కాస్త గ్యాప్ తీసుకుందామని అనుకుంటున్నారా?

అపోజిషన్‌లోకి వచ్చేసరికి సైలెంట్ అయిపోయారు..

కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిరెండు తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అక్కర్లేని పేరు. గుడ్ మార్నింగ్ ధర్మవరం పేరుతో ఒక సెపరేట్ ఇమేజ్ తెచ్చుకున్న ఆయన.. ఎన్నికల్లో ఓడిన తర్వాత సైలెంట్ అయిపోయారు. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో రెస్పాండ్ అవడం తప్ప..ప్రజాక్షేత్రంలో మాత్రం యాక్టీవ్ కావడం లేదు.

ఇదే ఇప్పుడు ధర్మవరం నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. అధికారంలో ఉన్నప్పుడు నిత్యం ప్రజల్లో ఉన్న కేతిరెడ్డి.. అపోజిషన్‌లోకి వచ్చేసరికి సైలెంట్ అయిపోవడం..ప్రజా సమస్యలను పెద్దగా పట్టించుకోకపోవడం..నిరసనలకు దూరంగా ఉండటం చర్చనీయాంశం అవుతోంది.

గుడ్ మార్నింగ్ ధర్మవరం పేరుతో రోల్ మోడల్‌గా మారిపోయారు..

కేతిరెడ్డి మార్క్ పాలిటిక్సే వేరు. తండ్రి ఫ్యాక్షన్ కక్షలకు బలైతే..అనుకోకుండా 2005లో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 2009లో ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యేగా గెలిచారు. 2014 ఎన్నికల్లో ఓడినా గుడ్ మార్నింగ్ ధర్మవరం పేరుతో ప్రజల్లో ఉంటూ అందరికీ ఒక రోల్ మోడల్‌గా మారిపోయారు. మెయిన్ స్ట్రీమ్ మీడియాకు దూరంగా ఉంటూ..సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే కేతిరెడ్డి రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితంగా మారిపోయారు.

చెరువు స్థలాన్ని ఆక్రమించి.. విలాసవంతమైన ఫామ్‌హౌస్ కట్టుకున్నారన్న ఆరోపణలు..

ఈ క్రమంలోనే 2019 ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ధర్మవరం డెవలప్ మెంట్‌లో తన మార్కు చూపించారు. అలా అని ఆయనపై ప్రతర్థుల ఆరోపణలు, విమర్శలేం తక్కువ లేవు. ధర్మవరంలో చెరువు స్థలాన్ని ఆక్రమించి.. ఒక విలాసవంతమైన ఫామ్‌హౌస్ కట్టుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గుడ్ మార్నింగ్ పేరుతో జనంలోకి వెళ్లి.. సమస్యలు పరిష్కరించడం ఒకవైపు అయితే.. ఖాళీ స్థలాలను కబ్జా చేశారని అలిగేషన్స్ వినిపించాయి.వీటన్నింటిని కేతిరెడ్డి బలంగా తిప్పి కొట్టలేకపోయారు. 2024 ఎన్నికలు వచ్చే సమయానికి..ధర్మవరం నియోజకవర్గంలో పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో టీడీపీ బలంగా మారింది. అయితే పొత్తుల్లో భాగంగా ధర్మవరం టికెట్ పరిటాల శ్రీరామ్‌కు కాకుండా బీజేపీ నేత సత్యకుమార్‌కు ఇచ్చారు.

అందరి అంచనాలను తలకిందులు చేస్తూ సత్యకుమార్ గెలుపు..

వాస్తవానికి కేతిరెడ్డి అంటే రెండు తెలుగు రాష్ట్రాలకు తెలుసు. ధర్మవరం ప్రజలకు ఇంకా బాగా తెలుసు. ఇలాంటి క్రమంలో అసలు పరిచయం లేని సత్యకుమార్ ఎలా గెలుస్తారన్న అభిప్రాయం అందరిలోనూ ఉండేది. కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ సత్యకుమార్ స్వల్ప మెజారిటీతో కేతిరెడ్డిపై విజయం సాధించారు. దీంతో ఒక్కసారిగా కేతిరెడ్డి డీలా పడిపోయారు. ఓటమి తర్వాత ఆయన వైరాగ్యంలో కనిపించారు.

ఓటమి తర్వాత గడ్డం పెంచుకొని..



యంగ్ పొలిషియన్‌గా ఉన్న కేతిరెడ్డి ఎప్పుడూ స్టైలిష్ డ్రస్సులతో, హెయిర్ స్టైల్‌తో కనిపించే వారు. కానీ ఓటమి తర్వాత గడ్డం పెంచుకొని ఆయన లుక్కే మారిపోయింది. తన ఓటమికి కారణాలేంటి.? రాష్ట్రంలో వైసీపీ ఎందుకు ఓడిపోయింది.? అధిష్టానం చేసిన తప్పులు ఏంటి.? ప్రజలు ఏ విధంగా ఆలోచించారు.? ఈవీఎంల పనితీరు ఎలా ఉంది.? ఇలాంటి అంశాల మీదే కేతిరెడ్డి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ వచ్చారు. కానీ ధర్మవరం నియోజకవర్గంలో మాత్రం యాక్టివ్ కాలేదు. పార్టీని నమ్ముకున్న ఎంతోమంది ఆయన కోసం ఎదురుచూస్తున్నప్పటికీ..నియోజకవర్గంలో పెద్దగా అందుబాటులో ఉండట లేదట.ఒకానొక సమయంలో కేతిరెడ్డి మంచి వాక్ చాతుర్యం, అలాగే సబ్జెక్ట్ పరంగా మాట్లాడే నేతగా ఉండటంతో వైసీపీ అధిష్టానం ఆయనకు జిల్లా పగ్గాలు అప్పగించింది. అయితే ధర్మవరం ప్రజలు తనను ఓడించారన్న బాధనో లేక కోపమో తెలియదు కానీ.. కేతిరెడ్డి నియోజకవర్గ సమస్యల మీద స్పందించడం లేదు. ఇప్పటివరకు ఎక్కడా ధర్మవరం రాజకీయాలపై మాట్లాడలేదు. పైగా పార్టీ అధిష్టానం రైతు సమస్యల మీద రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిస్తే..జిల్లాలో అందరూ నాయకులు పాల్గొన్నా కేతిరెడ్డి మాత్రం దూరంగా ఉన్నారు. దీంతో అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు టాక్.

కేతిరెడ్డి మౌనంపై రకరకాల చర్చలు..

ఆ తర్వాత విద్యుత్ ఛార్జీల పెంపుపై అధిష్టానం ఇచ్చిన పిలుపుకు కేతిరెడ్డి స్పందించారు. ధర్మవరంలో భారీ నిరసన చేపట్టి..మళ్లీ యాక్టీవ్ అవుతున్నట్లు సంకేతం ఇచ్చారు. ఆ నిరసన తర్వాత కూడా మళ్లీ ఆయన సైలెంట్‌గానే ఉంటున్నారు. తిరుపతి తొక్కసలాట ఘటనపై సోషల్ మీడియాలో తనదైన శైలిలో స్పందించారు. కానీ కేతిరెడ్డి ప్రత్యక్షంగా ప్రజాక్షేత్రంలో కనిపించడం లేదు. అయితే కేతిరెడ్డి ఎందుకు యాక్టివ్ కాలేదన్న దానిపై రకరకాల చర్చలు జరుగుతున్నాయి. ఒకానొక సందర్భంలో ఆయన జనసేనలోకి వెళ్తారన్న ప్రచారం కూడా సాగింది. కానీ కేతిరెడ్డి వ్యవహార శైలి చూస్తుంటే అందులో నిజం లేదన్నది తేలిపోయింది.అసలు కేతిరెడ్డి మనసులో ఏముంది? ఆయన ఎందుకు నియోజకవరంగంలో యాక్టీవ్ కావడం లేదన్నది ఎవరికీ అంతుచిక్కడం లేదు. వాస్తవంగా ధర్మవరంలో చాలా సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చేనేత సామాజికవర్గం అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో నలిగిపోతోందట. ఈ అంశం మీద కదిరి ఎమ్మెల్యే కందికుంటనే స్పందించారు కానీ.. ధర్మవరంలో కీలకంగా ఉండే కేతిరెడ్డి మాత్రం రియాక్ట్ కాలేదు.అయితే అధికార కూటమి సర్కార్‌కు టైమ్ ఇవ్వాలనే ఆలోచనతోనే కేతిరెడ్డి మౌనంగా ఉంటున్నట్లు క్యాడర్, ఆయన అనుచరులు చెప్తున్నారు. త్వరలోనే తమ నేత మళ్లీ యాక్టీవ్ అయి..ప్రజా సమస్యలపై పోరు మొదలుపెడతారని అంటున్నారు. చూడాలి మరి కేతిరెడ్డి అడుగులు ఎటువైపు పడుతాయో.


## సంక్షోభంలో మిర్చి రైతు...



గుంటూరు : రాష్ట్రంలో మిర్చి రైతులు సంక్షోభంలో చిక్కుకుంటున్నారు. గత ఏడాది కాలంగా ధరల తగ్గుదలతో మిర్చి సాగు గిట్టుబాటు కాక రైతులు అల్లాడుతున్నారు. పెట్టుబడి పెరగడం, ఆదాయం తగ్గడంతో ఎకరా ఒక్కంటికీ లక్షన్నర రూపాయల వరకూ రైతులు నష్టపోతున్నారు. 2019-20, 2020-21లో సగటు ధర రూ.12 వేలు లభించింది. 2021-22లో రూ.13 వేలు, 2022-23లో రూ.20,500., 2023-24లో రూ.20 వేలు వచ్చాయి. 2024-25లో ఈ ధర రూ.13 వేలకు పతనమైంది. గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు గరిష్ట సగటు ధర రూ.13 వేలు దాటలేదు. కరోనా సమయంలో కొంత ఇబ్బంది ఎదురైనా ఆ తర్వాత రెండేళ్లు పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయి. అయితే, 2024, 2025లో ధరల పతనం కొనసాగుతోంది. 2022, 2023 సంవత్సరాల్లో మార్కెట్‌లో ధరలు బాగా ఉండడంతో ఇదే తరహాలో ధరలు పెరుగుతాయని ఆశించి రైతులు మిర్చి సాగుపై ఆసక్తి కనబర్చారు. అనూహ్యంగా గతేడాది జనవరి నుంచి ధరలు తగ్గడంతోకోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన సరుకు కదలడం లేదు. 2023తో పోలిస్తే మేలైన రకాలకు క్వింటాలుకు రూ.10 నుంచి 15 వేల వరకు ధర తగ్గింది. మేలు రకాలు బాడిగ, దేవనారు డీలక్సు, తేజ వెరైటీలకు 2022, 2023 సంవత్సరాల్లో గరిష్టంగా రూ.20 వేల నుంచి రూ.28 వేల వరకు ధర పలికింది. గత ఏడాది, ఈ ఏడాది సగటున రూ.10 వేల నుంచి రూ.15 వేలు తగ్గింది. ఎకరాకు సగటున పది క్వింటాళ్ల మిర్చి దిగుబడి వస్తుందని అంచనా. ధర తగ్గడంతో ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు రైతులకు నష్టం వస్తోంది. గతేడాది ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ ఏడాదీ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రస్తుతం గుంటూరు పరిసర ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజీల్లో 18 లక్షల టిక్కిల మిర్చి నిల్వ ఉంది. ప్రస్తుతం రాయలసీమతో, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి రోజుకు 40 వేల నుంచి 60 వేల టిక్కిలు వస్తున్నాయి. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉన్న సరకు అమ్ముడుపోక, కొత్త సరకుకు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. ఎకరాకు రూ.లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు రెండేళ్ల క్రితం కనీసం లక్షన్నర వరకు లాభాలు వచ్చేవి. 2014లో ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం వచ్చింది. 2015లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఎగుమతి ఆర్డర్లు తగ్గాయని, ఇతర రాష్ట్రాల్లో కూడా మిర్చి సాగు పెరిగిందని, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేదని చెబుతూ గత కొంతకాలంగా మిర్చి ధరలను వ్యాపారులు తగ్గిస్తున్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది ధరలు మరింత తగ్గాయి. గరిష్ట ధర మేలు రకాలకు రూ.15 వేలు, సాధారణ రకాలకు రూ.13,500 మాత్రమే వస్తోంది. పేరెన్నిక స్పెషల్ వెరైటీలు తేజ, బాడిగ ధరలు కూడా భారీగా తగ్గాయి. తేజ కనిష్ట ధర రూ.7,500, గరిష్ట ధర రూ.15,500 మాత్రమే లభిస్తోంది. బాడిగ కనిష్ట ధర రూ.7,500, గరిష్ట ధర రూ.13,500 వస్తోంది. దేవనారు డీలక్స్ కనిష్టం రూ.8,500, గరిష్టం రూ.15 వేలు మాత్రమే లభిస్తోంది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్న సరుకు ధరలు ఇంకా తగ్గుతున్నాయి. ధరల పతనంపై ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి సమీక్షా చేయలేదు. గిట్టుబాట ధర కల్పించి తమను ఆదుకోవాలని మిర్చి రైతులు కోరుతున్నారు.

## కేరళ,తమిళనాడు సముద్ర తీరాలకు ఉప్పెన ముప్పు

తిరువనంతపురం: కేరళ , తమిళనాడు తీరాలకు 'కల్లక్కడల్' ముప్పు పొంచి ఉందని కేంద్ర ప్రభుత్వ సంస్థ ముందస్తు హెచ్చరిక జారీ చేసింది..రేపు రాత్రి అకస్మాత్తుగా సముద్రంలో వచ్చే ఉప్పెన కారణంగా బలమైన అలలు ఎగసిపడే అవకాశం ఉందని సమాచారం. ఆ రోజు రాత్రి 11.30 గంటల వరకు తీరంలోని వివిధ ప్రాంతాల్లో 0.5 మీ. నుంచి 1 మీటర్ల మేర అలల తాకిడి ఉంటుందని, సముద్ర ఉప్పెన ముప్పు పొంచి ఉందని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓసియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఐఎన్‌సీవోఐఎస్) హెచ్చరించింది. 'ఐఎన్‌సీవోఐఎస్' సమాచారం ఇచ్చిన నేపథ్యంలో కేరళ విపత్తు ప్రతిస్పందన నిర్వహణ సంస్థ 'కేఎస్‌డీఎంఏ' అప్రమత్తమైంది. అధికారుల సూచన మేరకు తీర ప్రాంత ప్రజలు సురక్షిత ప్రదేశాలకు తరలివెళ్లాలని సూచించింది.తీర ప్రాంత వాసులు ఎట్టి పరిస్థితుల్లో చిన్న పడవలు, దేశవాళీ పడవలు వేసుకొని సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరించింది. ముందుగానే పడవలను సురక్షిత ప్రదేశానికి చేర్చుకోవాలని ప్రకటించింది. ప్రస్తుతం జారీ చేసిన ప్రకటనను విరమించుకొనే వరకు పర్యటకులు బీచ్‌లలో విహారానికి రావొద్దని అధికారులు



విజ్ఞప్తి చేశారు. తీర ప్రాంతాలపై అదనపు నిఘా ఉంచాలని అధికారులకు 'కేఎస్‌డీఎంఏ' సూచించింది.

ఏంటీ కల్లక్కడల్?

కల్లక్కడల్ అనేది సముద్రంలో అకస్మాత్తుగా సంభవించే మార్పు. అంటే సముద్రం ఓ దొంగలా దూసుకొస్తుందని అర్థం. హిందూ మహాసముద్రంలోని దక్షిణ భాగంలో కొన్ని సార్లు వీచే బలమైన గాలులే సముద్రం ఇలా అకస్మాత్తుగా ఉప్పొంగడానికి కారణమని 'ఐఎన్‌సీవోఐఎస్' సంస్థ వెల్లడించింది.

## వాతావరణంలో మార్పులు

విశాఖపట్టణం,సంక్రాంతి ముందు వాతావరణం మబ్బుగా ఉంటుంది. చలికూడా తీవ్రంగానే ఉంటుంది. అయితే రాబోయే కొద్ది రోజుల్లో.. అంటే సంక్రాంతి పండుగ తర్వాత తుఫాన్ ఏర్పడే అవకాశం ఉందని కేరళ వాతావరణ శాఖ స్పష్టం చేసింది. కేరళ వాతావరణ శాఖ రిలీజ్ వెదర్ రిపోర్టులో ఈ మేరకు వివరించింది. ఈ నెలాఖరులో బంగాళాఖాతంలో, హిందూ మహా సముద్రంలో తుఫాన్ ఏర్పడే సూచనలు ఉన్నాయని.. అందుకే వాతావరణంలో విపరీతమైన మార్పులు అని వెల్లడించింది. ప్రస్తుతం కేరళ రాష్ట్రంలో కొన్ని రోజులుగా వేడి వాతావరణం ఉందని.. సంక్రాంతి పండక్కి చలిగాలులు వీస్తాయని వెల్లడించింది. బంగాళాఖాతం, హిందూమహా సముద్రం నుంచి భూ వాతావరణంలోకి గాలులు పెరిగాయని.. ఈ ప్రభావంతోనే చలి తీవ్రత విపరీతంగా పెరుగుతుందని కేరళ వెదర్ రిపోర్ట్ వెల్లడించింది.కేరళ వాతావరణ శాఖ నివేదికల ప్రకారం.. బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలో రానున్న వారం రోజుల్లో అల్పపీడనం ఏర్పడ నుందని.. ఇది బలపడి వాయుగుండంగా మారనుందని తెలిపింది. ఈ అల్ప పీడన ప్రభావంతో జనవరి 12, 13 తేదీలలో కేరళలో ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుండటంతో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, వేటకు వెళ్లొద్దని సూచించింది. కేరళ,-కర్ణాటక, లక్షద్వీప్ తీరాల్లో చేపల వేటకు ఎలాంటి అంతరాయం ఉండదని కేంద్ర వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి బంగాళాఖాతం దానిని ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలలో గంటకు 35 నుండి 45 కి.మీ వేగంతో కూడిన బలమైన గాలులు వీస్తాయని.. దీని ప్రభావంతో కేరళ, తమిళనాడులో అక్కడకక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది వెదర్ డిపా÷-టం÷-మెంట్. అలాగే, 11, 12వ తేదీన దక్షిణ తమిళనాడు తీరం, గల్ఫ్ ఆఫ్ మన్నార్‌లోని కన్యాకుమారి ప్రాంతంలో గంటకు 35 నుండి 45 కిమీ వేగంతో బలమైన గాలులు వీస్తాయని తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్ప పీడనం సంక్రాంతి పండుగ లోపు బలపడి వాయుగుండంగా మారే ఛాన్స్ ఉందని.. సంక్రాంతి పండుగ తర్వాత ఈ వాయుగుండం తీవ్రమై తుఫాన్ గా మారే అవకాశం ఉందని కేరళ వాతావరణ శాణ అంచనా వేసింది.

## టాక్ ఆఫ్ ది తెలంగాణ పాలిటిక్స్‌గా దానం నాగేందర్..

హైదరాబాద్,మాస్ లీడర్.. దానం నాగేందర్ రూటే సెపరేటు. ఆయన ఏ పార్టీలో ఉన్న..ఏ పదవిలో ఉన్న..ఎప్పుడు ఏదో ఒక ఇష్యూతో టాక్ ఆఫ్ ది మీడియాగా మారుతుంటారు. పక్కా హైదరాబాదీ స్లాంగ్‌తో డైలాగులు పేల్చుతూ, ధమ్కీలు ఇస్తూ తన హవా నడిపిస్తుంటారు. అయితే మొన్నటి ఎన్నికల తర్వాత కాంగ్రెస్ గూటికి చేరిన దానం నాగేందర్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైందట. మంత్రి పదవి వస్తుందన్న ఆశతో హస్తం పార్టీలో చేరిన ఆయనకు అమాత్య యోగం దక్కలేదు.పైగా ఆయనకు ఇష్టం లేకపోయినా లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎంపీగా కంటెస్ట్ చేయించారట కాంగ్రెస్ పెద్దలు. ఆ తర్వాత అయినా మంత్రి పదవి వస్తుందని ఆశిస్తే భంగపాటు తప్పదని భావిస్తున్నారట. పైగా తను ఏదైనా పని చేయాలని అడిగితే ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదని గుస్సా అవుతున్నారట దానం. అందుకే కొన్నాళ్లుగా కాంగ్రెస్ సర్కార్ పెద్దలు, సీఎం రేవంత్ తీరుపై అసంతృప్తితో ఉన్నారట. ఈ నేపథ్యంలో దానం టంగ్ చేంజ్ చేశారన్న టాక్ వినిపిస్తోంది.వైఎస్ హయాంలో గ్రేటర్ హైదరాబాద్‌లో రాజకీయంగా ఓ ఊపు ఊపిన దానం.. 2014 తర్వాత పెద్దగా చెప్పుకోదగ్గ పదవిలో ఉండలేకపోయారు. 2014లో ఓడిన దానం.. తిరిగి 2018లో ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్ఎస్ గూటికి చేరారు. కేసీఆర్ క్యాబినెట్‌లో బెర్త్ ఆశించినా దక్కలేదు. తర్వాత హస్తం గూటికి చేరినా ఆయనను పట్టించుకునే నాధుడే లేడట. అందుకే దానం రూటు మార్చినట్లు చర్చ జరుగుతోంది. ఓ వైపు ప్రభుత్వాన్ని, మరోవైపు కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టేలా మాట్లాడుతుండటంతో..ఈ వలస ఎమ్మెల్యే వ్యవహారం ఇబ్బందికరంగా మారిందని గాంధీభవన్ టాక్.

అందుకే సైలెంట్?

పవర్ ఎక్కడుంటే దానం నాగేందర్ అక్కడుంటాడన్నది పబ్లిక్ మాట. అందుకు అనుగుణంగానే అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయన హస్తం పార్టీలోకి వెళ్లారు. కాంగ్రెస్ బీఫామ్ మీద ఎంపీగా పోటీ చేయడంతో ఆయనపై అనర్హత వేటు పడటం ఖాయమన్న చర్చ జరుగుతోంది. అయితే ఖైరతాబాద్ బైపోల్ వస్తే దానంకు టికెట్ ఇవ్వకూడదని హస్తం పార్టీ డిసైడ్ అయ్యిందన్న చర్చ కూడా జరిగింది. ఈ విషయాలన్నీ కాస్త ఆలస్యంగా గ్రహించిన దానం కొంత సైలెంట్ అయిపోయారట.ఇక ఊరికే ఉండలేకే సీఎం రేవంత్‌తో పాటు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేలా మాట్లాడుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. రాజకీయ వర్గాల్లో సంచలనం రేపుతున్న ఫార్ములా ఈ కార్ రేస్ విషయంలో దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేలా ఉన్నాయంటున్నారు.ఈ కార్ రేస్‌తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అదే విషయాన్ని స్పష్టంగా చెబుతున్నారని దానం నాగేందర్ అంటుండంతో ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నేతలకు ఏం చేయాలో పాలుపోవడం లేదట. ఈ కార్ రేస్ వ్యవహారంలో అవినీతి జరిగిందని, దాన్ని నిరూపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న సమయంలో అధికార పార్టీలో ఉండి దానం నాగేందర్ ప్రతిపక్ష నేతకు అనుకూలంగా మాట్లాడటం ఏంటన్న చర్చ జరుగుతోంది.ఈ ఒక్క ఇష్యూనే కాదు పలు సందర్భాల్లో దానం చేసిన కామెంట్స్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా మారాయన్న చర్చ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలను విమర్శించేలా, సర్కార్‌ను కార్నర్ చేసేలా దానం కామెంట్స్ చేస్తున్నారని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారట. చెరువుల పరిరక్షణ కోసం తీసుకొచ్చిన హైడ్రాకు వ్యతిరేకంగా విమర్శలు చేసి ఇటు ప్రభుత్వాన్ని, అటు పార్టీని ఇరుకునపడేలా చేశారు దానం నాగేందర్.

రేవంత్ అండ్ టీంకు ఏం చేయాలో అర్థం కావడం లేదా?

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై తీవ్రస్థాయిలో ఫైర్ అయిన దానం.. పరోక్షంగా ప్రతిపక్షాలకు ఛాన్స్ ఇచ్చారని అప్పట్లో చర్చ జరిగింది. ఇక అల్లుఅర్జున్ అరెస్ట్ ఇష్యూలో కూడా దానం నాగేందర్ ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టడం చర్చనీయాంశమవుతోంది. అల్లుఅర్జున్ అరెస్ట్ సరికాదని, పార్టీకి నష్టమంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కామెంట్స్ చేయడంతో..రేవంత్ అండ్ టీంకు ఏం చేయాలో అర్థం కావడం లేదట.అయితే దానం నాగేందర్ ఇలా ప్రభుత్వానికి, పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడటం వెనుక అసలు కారణం వేరే ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. తన వ్యక్తిగత సమస్యలు కొన్నింటిని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరగా..సీఎం రేవంత్ రెడ్డి సహా మంత్రులెవరు పెద్దగా పట్టించుకోవడం లేదట. అందుకే దానం ప్రభుత్వాన్ని, పార్టీని ఇరుకున పెట్టేలా మాట్లాడుతున్నారని అంటున్నారు. రివర్స్ గేర్ వేస్తేనే తనను పిలిచి బుజ్జగించి, అడిగిన పనులన్నీ చేసిపెడతారని దానం భావిస్తున్నారట.ఈ నేపథ్యంలోనే లేటెస్ట్‌గా దానం కేసీఆర్‌ను పొగడటం..ఫార్ములా ఈ రేస్ విషయంలో కేటీఆర్‌కు అనుకూలంగా మాట్లాడటం వంటివి చర్చకు వస్తున్నాయి.

# ఏపీలో ఐదుగురు ఐపీఎస్ అధికారుల బదిలీ

అమరావతి: ఏపీలో ఐదుగురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2021–22 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ సీఎస్ కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేహౌండ్స్ విభాగంలో అసాల్ట్ కమాండర్లుగా ఉన్న ఈ బ్యాచ్ కు చెందిన అధికారులందరికీ ఏఎస్పీలుగా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నవజ్యోతి మిశ్రాను చింతపల్లి ఏఎస్పీగా, నంద్యాల ఏఎస్పీగా మందా జావలి అల్ఫోన్స్‌ను నియమించారు. రాజంపేట ఏఎస్పీగా మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే, కాకినాడ ఏఎస్పీగా దేవరాజ్ మనీష్, తాడిపత్రి ఏఎస్పీగా రోహిత్ కుమార్ చౌదరిని బదిలీ చేశారు. అలాగే కాకినాడ ఏఎస్పీగా పాటిల్ దేవరాజ్ మనీశ్, తాడిపత్రి ఏఎస్పీగా రోహిత్ కుమార్ చౌదరి, రాజంపేట ఏఎస్పీగా మనోజ్ రామ్నాథ్ హెగ్డే బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

# తొలిరోజే కోటిన్నరమంది పుణ్యస్నానాలు

ప్రయాగ్‌రాజ్,ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ లో ప్రారంభమైన మహా కుంభమేళా కు తొలిరోజే భక్తులు పోటెత్తారు. గంగ, యమున, సరస్వతీ నదుల సంగమంలో 1.50 కోట్ల మంది పవిత్ర స్నానాలు చేశారు. సోమవారంనాడు పుష్య పౌర్ణమి సందర్భంగా బీహార్, హర్యానా, బెంగాల్, ఒడిశా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో వివిధ ఘాట్లు కిటకిటలాడాయి. మహాకుంభమేళా వేలాదిగా తరలి వస్తున్న భక్తులకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అభినందనలు తెలిపారు. పుష్యమాస పౌర్ణమి రోజున త్రివేణి సంఘంలో పవిత్ర స్నానాల కోసం విచ్చేసి సాధువులు, కల్పవాసీలు, భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 'మహా కుంభమేళా తొలిరోజు సనాతన ధర్మాన్ని ఆచరించే 1.50 కోట్ల మంది స్వచ్ఛమైన త్రివేణీ జలాల్లో పవిత్ర స్నానాలు చేయడం ద్వారా ఈ పండుగను విజయవంతం చేశారు. ఇందుకు సహకరించిన మహాకుంభ మేళా అడ్మినిస్ట్రేషన్, ప్రయాగ్‌రాజ్ అడ్మినిస్ట్రేషన్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రయాగ్‌రాజ్, స్వచ్ఛాగ్రహీలు, గంగా సేవాదూత్‌లు, కుంభ్ సేవక్లు, మత-సామాజిక సంస్థలు, వివిధ వాలంటరీ సంస్థలు, మీడియా ప్రపంచం సహా మహాకుంభ్‌తో మమేకమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను' అని యోగి పేర్కొన్నారు. 'మహాకుంభ్ భిన్నత్వంలో ఏకత్వం సందేశాన్ని చాటుతూ భిన్న సంస్కృతులను ఏకం చేస్తోందని యోగి ఆదిత్యనాథ్ ఒక ట్వీట్‌లో అభివర్ణించారు. సాంస్కృతి సమ్మేళనం ఎక్కడుందంటే విశ్వాసం, సామరస్యం అక్కడే ఉంటుందన్నారు. ప్రయోగ్‌రాజ్ సనాతన ధర్మానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పారు. కాగా, తెల్లవారుజాము నుంచి దట్టమైన పొగమంచు, తీవ్రమైన చలిగాలులు ఉన్నప్పటికీ లెక్కచేయకుండా వేలాది మంది భక్తులు త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానాలకు ఎంతో ఉత్సాహంగా తరలివచ్చారు. వయోభేదం లేకుండా అన్ని రంగాలకు చెందిన ప్రజలు పవిత్ర స్నానాలతో పులకించిపోయారు. భజనలు, జై గంగా మయ్యా నినాదాల మధ్య 'మహాకుంభ్' అంగరంగ వైభవంగా మొదలైంది.

# తెలంగాణ పసుపు బోర్డు ఏర్పాటు

న్యూఢిల్లీ, తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సంక్రాంతి పండుగ సందర్భంగా శుభవార్త అందించింది. నిజామాబాద్ కేంద్రంగా కొత్తగా పసుపు బోర్డ్ ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి, పల్లె గంగారెడ్డిని పసుపు బోర్డు ఛైర్మన్‌గా నియమించినట్లు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపి బండి సంజయ్ ప్రయత్నం ఫలించి బోర్డు ఏర్పాటు జరిగింది. గతంలో స్పైసెస్ బోర్డు ఏర్పాటు చేయగా, ప్రత్యేకించి పసుపుబోర్డు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వచ్చింది. ఈ నిర్ణయంతో తెలంగాణలో పసుపు రైతుల క్రయ, విక్రయాలు, ప్రాసెసింగ్‌కు మరింత ప్రోత్సాహం లభించనుంది. నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రారంభోత్సవం జరగనున్నది. ఈ కార్యక్రమం తెలంగాణకు మరో ప్రాముఖ్యమైన మైలురాయి కానుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల, వ్యవసాయ శాఖల అధికారులు, పశ్చిమ రాష్ట్రాల ఇతర వ్యవసాయ సంబంధిత నాయకులు, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిసింది. ప్రారంభోత్సవం సందర్భంగా పసుపు రైతులకు సంబంధించి వ్యూహాలు, నూతన ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు, సహాయ కార్యక్రమాలను ప్రకటించే అవకాశం ఉంది. రైతులకు పసుపు విక్రయాలు, మార్కెట్‌కు ఉన్న అవరోధాలు, రుణాల వంటి అంశాలపై పలు ముఖ్యమైన చర్చలు జరగనున్నాయి. పసుపు రైతుల సమస్యలు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు కేంద్రం ఈ బోర్డు స్థాపించనుంది. తెలంగాణ రాష్ట్రంలో పసుపు సాగులో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న నిజామాబాద్, కొమురంభీం ఇతర జిల్లాలలోని రైతులకు ఈ బోర్డు ద్వారా మరింత సాయం అందనుంది. కేంద్ర ప్రభుత్వం పసుపు పంటను ఒక ప్రత్యేకమైన పరిశ్రమగా భావించి, రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ఈ బోర్డు ఏర్పాటును ప్రకటించింది. మరోవైపు ప్లలె గంగారెడ్డి రైతు సంక్షేమం కోసం పోరాడిన వ్యక్తి. ఆయన వ్యవసాయ రంగం మీద అవగాహన, పసుపు రైతుల సమస్యలను అర్థం చేసుకోవడంలో అనుభవం ఉన్న వ్యక్తి కావడంతో ఆయన నియామకాన్ని కేంద్రము సమర్థించింది. ఆయన మార్కెట్ ప్రవర్తన, గుణాత్మక అభివృద్ధిపై అనేక మార్గదర్శకాలపై అభిప్రాయం వెల్లడించారు. పసుపు బోర్డు ఏర్పాటు ద్వారా రైతులకు అనేక కొత్త అవకాశాలు రానున్నాయి. రైతులు పసుపు పంటను మరింత మంచి ధరలలో విక్రయించేందుకు మరింత సహాయాన్ని అందుకుంటారు. దీంతోపాటు పసుపు ప్రాసెసింగ్, ఎగుమతుల ప్రోత్సాహం, నూతన టెక్నాలజీలను ఉపయోగించి పంటల ఉత్పత్తి పెంచడం వంటి అంశాలపై రైతులకు మరింత అవగాహన పెరుగుతుంది. ఈ కొత్త బోర్డు ఏర్పాటుతో రైతులకు మంచి అవకాశం దక్కనుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అనేక మంది రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## సునామీ హెచ్చరికలు జారీ

టోక్యో, జపాన్‌లో భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 9 గంటల సమయంలో దేశ నైరుతి ప్రాంతంలో 6.9 తీవ్రతతో ప్రకంపనలు నమోదైనట్లు దేశ వాతావరణ ఏజెన్సీ తెలిపింది. క్యుషు ద్వీపంలోని మియాజాకి ప్రాంతంలో 37 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వెల్లడించింది. ఈ క్రమంలోనే మియాజాకితోపాటు కొచీ ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసింది. నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు. గతేడాది ఆగస్టులోనూ జపాన్‌లో రెండు భారీ భూకంపాలు సంభవించాయి. 6.9, 7.1 తీవ్రతతో ఏర్పడిన రెండు శక్తిమంతమైన భూకంపాలు నైరుతి దీవులైన క్యుషు, షికోకులను కుదిపేశాయి. అనేక ప్రాంతాలకు అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. అయితే.. ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# చైనా దాగుడుమూతలు!



సాధారణంగా దౌత్య సంబంధాల్లో అనూహ్యతకు తావుండదు. అవతలి దేశం మనతో చెలిమి కోరుకుంటున్నదో లేదో... అది మనవైపో, వేరేవాళ్లవైపో ఊహించటం పెద్ద కష్టం కాదు. కానీ చైనా మటుకు ఇందుకు విరుద్ధం. 'నేనేంటో చెప్పుకోండి చూద్దాం' అన్నట్టు వ్యవహరిస్తుంటుంది. నోటితో నవ్వి నొసటితో వెక్కిరిస్తున్న చందాన ప్రవర్తిస్తుంటుంది. రష్యాలో మూడు నెలల క్రితం బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరిగినప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌లు కలుసుకున్నారు. అంతకు రెండు రోజుల ముందు వాస్తవాధీన రేఖ ప్రాంతాలైన డెస్పాంగ్, డెమ్ చోక్‌లలో ఇరు దేశాల సైన్యాల గస్తీపై అవగాహన కుదిరింది. ఆ ప్రాంతంలో ఇకపై సైనిక విన్యాసాలకు చోటీయరాదనీ, ఉద్రిక్తతలను ఉపశమింపజేయాలనీ దాని సారాంశం. అంతేగాదు... రెండు దేశాలూ దీనిపై వేర్వేరు ప్రకటనలు విడుదల చేశాయి. చాన్నాళ్లుగా నిలిచిపోయిన ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల సమావేశం గత నెలలో జరిగింది కూడా. తీరా తాజాగా తూర్పు లద్దాఖ్ ప్రాంతంలో చైనా సైన్యం అధునాతన సాంకేతికతలతో, అన్నిరకాల నేలల్లోనూ పనికొచ్చే వాహనాలతో, డ్రోన్‌లతో, మానవరహిత విమానాలతో విన్యాసాలు నిర్వహించినట్టు బయటపడింది. తన సైనిక సామర్థ్యాన్ని, కొండప్రాంతాల్లో యుద్ధ సంసిద్ధతలను అంచనా వేసుకోవటానికి షిన్ జియాంగ్ మిలిటరీ కమాండ్ రెజిమెంట్ ఈ విన్యాసాలు నిర్వహించిందంటున్నారు. అంతక్రితం మాటెలావున్నా 2020 ఏప్రిల్‌లో గాల్వాన్ లోయలో మన సైన్యంతో గిల్లికజ్జాలకు దిగటం ద్వారా చైనా తన కవ్వింపు చర్యల జోరు పెంచింది. అప్పుడు జరిగిన ఘర్షణల్లో మన జవాన్లు 21 మంది చనిపోగా, చైనా కూడా గణనీయమైన నష్టాలు చవిచూసింది. ఆ ఘర్షణల్లోనే బిహార్ రెజిమెంట్‌లో 17వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అయిన తెలంగాణకు చెందిన బి.సంతోష్‌బాబు వీర మరణం పొందారు. అనంతర కాలంలో ఇరు దేశాల మధ్యా సైనిక అధికారుల స్థాయి చర్చలు జరిగాయి. కొన్ని అంశాల్లో ఒప్పందాలు కుదిరాయి. ఆ ఏడాది ఆగస్టులో రెండు దేశాల విదేశాంగమంత్రులూ భేటీ అయ్యారు. అందులో భారత్–చైనాల మధ్య పంచసూత్ర పథకం కుదిరింది. ఇకపై సామరస్యంగా మెలగాలన్నది ఆ పథకం సారాంశం. దానికి కొనసాగింపుగా రక్షణ మంత్రులు కూడా సమావేశమయ్యారు. ఆ తర్వాత వివాదాస్పద ప్రాంతాల్లో సైనికుల ఉపసంహ రణ కూడా మొదలైంది. కానీ సమస్య ఎక్కడిదక్కడే ఉంది. డెస్పాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల విషయం మొదటి నుంచీ జటిలమే. అందువల్లే ప్రస్తుతానికి ఇరు దేశాల సైన్యాలూ ఆ ప్రాంతాల్లో గస్తీ నిర్వహించాలని, ఉద్రిక్తతలు ముదిరే విధంగా ఎవరూ సైన్యాలను మోహరించ రాదని మూడు నెలలక్రితం నిర్ణయించారు. కానీ చైనాకు ఏమైందో కానీ దాన్ని బేఖాతరు చేస్తూ తాజాగా విన్యాసాలు మొదలుపెట్టింది. వారంరోజుల క్రితం షిన్‌జియాంగ్‌లోని వీగర్ స్వయంపాలిత ప్రాంతంలో ఉన్న హెూటాన్ నగరానికి సమీపంలో చైనా కొత్తగా రెండు కౌంటీలను ఏర్పాటు చేసిందన్న కథనాలు వెలువడటం గమనించదగ్గది. ఈ రెండూ కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లోని ఆక్సాయ్‌చిన్‌కు సమీపంలో ఉన్నాయి. దానిలోని కొంత భూభాగం ఈ రెండు కౌంటీల్లోనూ ఉన్నదంటున్నారు. ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి ఇది చాలదా? ఇక బ్రహ్మపుత్ర నదిపై ఒక మెగా డ్యామ్‌ను నిర్మించటానికి చైనా సన్నాహాలు చేస్తున్నదన్న వార్త కూడా ఇటీవలి పరిణామమే. ఎగువ ప్రాంతాల్లో ఆనకట్టలు కట్టినప్పుడు దిగువ ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందక ఇబ్బందులు తలెత్తు తాయి. భారీవర్షాల సమయంలో దిగువకు నీరు వదలటం వల్ల ఆ ప్రాంతాలు మునుగుతాయి. అందువల్లే దేశాలమధ్య ప్రవహించే నదులపై నిర్మాణాలకు పూనుకున్నప్పుడు పరస్పరం చర్చించుకుంటాయి. అందరికీ ప్రయోజనం కలిగేలా ఒప్పందాలు కుదుర్చుకుంటాయి. కానీ మెగా డ్యామ్ నిర్మాణాన్ని చైనా ఏకపక్షంగా ప్రకటించింది. దీనిపై మన దేశం తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఇక అరుణాచల్‌ప్రదేశ్‌కు మన నాయకులు వెళ్లినప్పుడల్లా చైనాకు ఆగ్రహావేశాలొస్తాయి. అక్కడి ఊళ్లకు సొంత పేర్లు పెట్టుకుని మనల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేయటం చైనాకు చాన్నాళ్లుగా దురలవాటు. అందుకే చైనా వ్యవహారశైలి తెలిసినవారెవరూ దాని మాటలు విశ్వసించరు. చెప్పే మాటలకు భిన్నమైన ఆచరణ ప్రదర్శించటం చైనాకు అలవాటైన విద్య. ఇరుగు పొరుగు దేశాలన్నాక సమస్యలు సహజంగా వస్తాయి. వాటిని చర్చించుకోవటం, పరస్పర అంగీకారంతో సామరస్యపూర్వక పరిష్కారాన్ని సాధించటం వివేకవంతమైన చర్య. సమస్యలను దశాబ్దాల తరబడి అలాగే వదిలేస్తే అవి జటిలంగా మారి చివరకు శత్రుత్వానికి దారితీస్తాయి. మనతో ఉన్న వివాదాల విషయంలో చైనా మొదటినుంచీ దాగుడుమూతలు ఆడుతోంది. వివాదాలను పక్కనబెట్టి వ్యాపార వాణిజ్యాలను విస్తరించుకుంటే ఇరు దేశాలూ అభివృద్ధి చెందుతాయని ఊరించి 70వ దశకం చివరిలో మనకు మైత్రీ హస్తం అందించింది మొదలు చైనా తీరుతెన్నులు ఎన్నడూ సక్రమంగా లేవు. సరిహద్దు పరిణామాలపై మన దేశం అప్రమత్తంగానే ఉన్నదని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ సోమవారం చేసిన ప్రకటన సూచిస్తోంది. వివాదాస్పద ప్రాంతాల్లో ప్రస్తుతానికి ప్రతిష్ఠంభన ఉన్నదని ఆయనంటున్నారు. బ్రహ్మపుత్ర నదిపై ఆనకట్ట నిర్మాణం విషయంలోనైనా, లద్దాఖ్ ప్రాంతంలో చైనా సైన్యం కదలికల విషయంలోనైనా మన దేశం దృఢంగా వ్యవహరించాలి. దేశ రక్షణకు అది తప్పనిసరి. కరచాలనం చేస్తూనే కత్తులు దూయటం ఏమైనా కావొచ్చుగానీ దౌత్య కళ కాదని చైనాకు తెలియచెప్పటం అవసరం.

# వర్తమాన రాజకీయాలకు.. పురాణేతిహాసాల్లో పాఠాలు!



'ఆర్ద్రత'లో వ్యత్యాసం, మర్యాద చూపించడంలో 'పక్షపాత మనస్తత్వం', 'అయినవారికి ఆకుల్లో కానివారికి కంచాల్లో' వడ్డించడంలా ప్రవర్తించడం లాంటి వైరుధ్యాలు అధికారంలో వున్న రాజకీయ నాయకులకు సర్వసాధారణం, మానవ నైజం. ఈ జాడ్యం క్రమేపీ రాజకీయేతర ప్రముఖులకు కూడా విస్తరిస్తున్నది. ఇది కేవలం, కలియుగం ప్రథమ పాదంలోనే కాదు. యుగయుగాలుగా, యుగధర్మాలకు అనుగుణంగా జరిగాయి. ప్రభుత్వాధినేతలు నిరంతరం అందుబాటులో, చేరువలో వుండే విషయంలో కానీబీ నలుగురు ప్రముఖులున్న చోట, రాజకీయ నాయకులు ఎలా మెసలుకోవాలనే విషయంలో కానీబీ ఆదరణ, నిరాదరణ విషయంలో కానీ, 'పెద్దలపట్ల చూపాల్సిన గౌరవ మర్యాదలు' విషయంలో కానీబీ ఇలాంటి మరెన్నో విషయాలలో కొన్ని ఆదర్శాలను పాటిస్తే మంచిదేమో! ఆదర్శాల మాట అటుంచి, కనీస మర్యాదలు పాటిస్తే అభిలషణీయమేమో! విద్యార్థిగా 'డొమిసియల్' సర్టిఫికేట్ కోసం వెళ్లి తహసీల్దార్‌ను కలవలేకపోవడం, పలుకుబడిగల ఇతరులు కలుస్తుంటే కళ్లప్పగించి చూడడం, హైదరాబాద్ వచ్చిన కొత్తలో సచివాలయానికి వెళ్తుంటే గేటు దగ్గర నిలిపివేయడం, రేడియో స్టేషన్‌కు వెళ్తే లోనికి పోవడానికి అనుమతి లభించకపోవడం, పలువురు ముఖ్యమంత్రులు, వారివారి పద్ధతులలో ఇతరులను కలవడం లేదా కలవకపోవడం, గవర్నర్‌ను కలవడానికి వచ్చేవారి విషయంలో, సమయపాలనకు పక్కా ప్రణాళిక వుండడం, ఎవరైనా ఎక్కడికైనా వెళ్లినప్పుడు ఒకరు మరొకరికి ఇవ్వాల్సిన గౌరవ మర్యాదలు లాంటి అనేకం, నిజజీవితంలో ప్రత్యక్షంగా అనుభంలోకి వచ్చినప్పుడల్లా, మహాభాగవతంలోని కొన్నిఘట్టాలు సందర్భోచితంగా గుర్తుకొచ్చాయి, ఇప్పటికీ వస్తున్నాయి. సనకసనందనాదులు శ్రీహరిని కలవడానికి వైకుంఠధామానికి ఐదేళ్ల బాలురలాగా వెళ్లారనీ, జయ, విజయులు అనే అక్కడ వున్న ద్వారపాలకులు, తమ ఉద్యోగ బాధ్యత నిర్వహణలో భాగంగా వారిని అడ్డుకుని, భూలోకంలో జన్మించమని వారిచ్చిన శాపానికి గురయ్యారనీ పోతన్న (వేదవ్యాస) మహాభాగవతంలో చదివాం. బయట ఈ గొడవ విన్న శ్రీహరి, శ్రీమహాలక్ష్మి సమేతంగా అక్కడికి వచ్చాడు. సనకసనందనాదులకు, వారు కోరుకున్న దర్శనం ఇచ్చారు. తన ద్వారపాలకులను క్షమించమనీ, వీళ్లు భూమ్మీద పుట్టి, కొంతకాలం ఉండి, అచిరకాలంలోనే తన దగ్గరకు తిరిగి వచ్చేవిధంగా అనుమతించమనీ శ్రీహరి అనగానే వారు ఒప్పుకున్నారు. ఈ కథలో సందేశం వుంది. అవి: ఒకరిని కలవాలనుకున్నప్పుడు వెళ్లే విధానం, విధి నిర్వహణ, కాలయాపన జరక్కుండా ఉండేటట్లు కలవడానికి వచ్చినవారిని బయటనే చూసి పంపించడం సెక్యూరిటీ సిబ్బంది బాధ్యతలు. ప్రభుత్వాల సుపరిపాలనకు ఒక గీటురాయి ఎన్నికైన ప్రజాప్రతినిధులు, ప్రజలకు సాధ్యమైనంత వరకు నిరంతరం అందుబాటు , చేరువలో వుండి, సమస్యల్ని సులభంగా చెప్పుకునే అవకాశాన్ని కల్పించగలగడమే. మర్యాదపూర్వకంగా కలవాలనుకునేవారికి, తమ తమ సంస్థల కార్యకలాపాలను వివరించాలనుకునేవారికి, తమకు తోచిన సలహాలు (స్వీకరించడం, స్వీకరించకపోవడం వారి ఇష్టం) ఇవ్వదల్చుకున్నవారికి, ఇలా దేనికైనా ఎవరైనా కావచ్చు. అలా వచ్చేవారిని కూడా తప్పక కలవాలి. ఒకప్పుడు, సత్రయాగాన్ని చూడడానికి బ్రహ్మ, యోగులు, సర్వ దేవతలు, మునీంద్రులు, అగ్నిహోత్రుడు, రుషులు, ప్రజాపతులు వచ్చారట. దక్షుడు రాకను గమనించిన సభాసదులందరూ మర్యాద పూర్వకంగా లేచి నిల్చున్నారు. బ్రహ్మ, మహేశ్వరులు మాత్రం లేవలేదు. దక్షుడు తండ్రైన బ్రహ్మకు నమస్కరించి, తనను చూసికూడా ఆసనం మీద నుండి దిగని అల్లుడైన శివుడిని శపించినప్పుడు, నందికేశ్వరుడు, దక్షుడిని శపించాడు. ప్రతిగా, భృగు మహర్షి శివుడిని శపించాడు. శివుడు అక్కడి నుండి వెళ్లిపోయాడు. దక్షుడికి, ఈశ్వరుడికీ పరస్పర విరోధం పెరిగింది. నలుగురు ప్రముఖులున్న చోట, ఎవరెవరితో ఎలా మెసలుకోవాల్నో, కోపతాపాలను ఎలా అదుపులో వుంచుకోవాల్నో అనే సందేశం ఇక్కడున్నది. ఆదరణ, నిరాదరణ (రాజకీయ నాయకుల హక్కు, అలవాటు) ఉత్తానపాదుడి వ్యవహార శైలి ద్వారా తెలుస్తుంది. ప్రియభార్య కొడుకు ఉత్తముడిని ముద్దుచేస్తూ, దగ్గరకు వచ్చిన మరో భార్య కుమారుడు ధ్రువుడిని పట్టించుకోక పోవడంతో, తండ్రి ప్రేమ కొరకు, ధ్రువుడు ఏకాగ్ర చిత్తంతో శ్రీహరి కటాక్షం కోసం తపస్సు చేశాడు. ప్రత్యక్షమైన శ్రీహరి 'ధ్రువక్షితి' (ధ్రువపదం)ని, ఆ తరువాత సప్తర్షి మండలంకన్న పైనున్న విష్ణు పదాన్ని ప్రసాదించాడు. రాజ్యానికి తిరిగొచ్చి తల్లుల ప్రేమ, తండ్రి ప్రేమ పొందాడు. నిర్లక్ష్యం చేయబడ్డ వ్యక్తి పట్టుదలతో ఎలా ఉన్నత స్థాయికి చేరుకోగలరో ధ్రువోపాఖ్యానం ద్వారా తెలుసుకోవచ్చు. ఇష్టమున్న వారిని ఆదరించడం, లేనివారిని నిరాదరణకు గురిచేయడం తప్పని చెప్పే మహాభాగవత కథ ఇది. 'పెద్దలపట్ల చూపాల్సిన కనీస గౌరవ మర్యాదలు' కనుమరుగవుతున్న నేపథ్యంలో, అలా జరిగితే తలెత్తే ఇబ్బందులు, పరిష్కార మార్గాలు తెలియచేసే ఆసక్తికర ఘట్టం మహాభాగవతంలో వున్నది. ఇంద్రుడు ముక్కోటి దేవతలతో కొలువుతీరి, అప్సరసలు పాడుతు, ఆడుతుండగా, దేవతాగణానికి గురువైన బృహస్పతి అక్కడికి వచ్చినప్పటికీ, ఇంద్రుడు తన సింహాసనం మీదనుండి లేవలేదు. ఆయనకు స్వాగతం చెప్పలేదు. కనీసం కూర్చోమని కూడా అనలేదు. బృహస్పతికి కోపం వచ్చి, వెనుతిరిగి వెళ్లిపోయాడు. తరువాత ఇంద్రుడు చింతించినా ఫలితం కలగలేదు. బృహస్పతి ఆధ్యాత్మ మాయద్వారా అదృశ్యుడై పోయాడు. సలహా ఇవ్వడానికి గురువులేని అవకాశం చూసుకుని, రాక్షసులు, శుక్రాచార్యుడి ప్రోద్బలంతో దేవతలమీద యుద్ధానికి పోయారు. భయంతో బ్రహ్మ దగ్గరకు వెళ్లిన దేవతలను, బృహస్పతి పట్ల వారు ప్రవర్తించిన తీరుకు మందలించి, ప్రస్తుతానికి అధిక బలాఢ్యుడైన 'విశ్వరూపుడిని' ఆరాధించి, రాక్షసులను గెలవమని సలహా ఇచ్చాడు. దేవతలు విశ్వరూపుడి దగ్గరకు వెళ్లారు. పౌరోహిత్యం చెయ్యమని అర్థించారు. విశ్వరూపుడు గురుభావాన్ని స్వీకరించాడు. కొంతకాలం దేవతలకు బృహస్పతి స్థానంలో ఆచార్యుడిగా వున్నాడు. శత్రువుల బారినుండి రక్షించే శ్రీమన్నారాయణ కవచాన్ని, దేవేంద్రుడికి విశ్వరూపుడు బోధించాడు. ఇంద్రుడు దాన్ని ధ్యానం చేసి రాక్షసులను జయించాడు. బృహస్పతిని అవమానించకపోతే, దేవతలు ఇంత ఇబ్బందిపడేవారు కాదుకదా! అధికార పీఠంపై వున్న వర్తమాన రాజకీయ నాయకులలో, ప్రస్ఫుటంగా బహిర్గతమవుతున్న నిరంకుశ ధోరణులు, ప్రశ్నించే వారిని అణచివేతకు గురిచేసే సందర్భాలు, తమ విధానాలను విమర్శించే వారి విషయంలో అనుసరిస్తున్న కక్షపూరిత చర్యలు, తప్పని తెలుసుకోవాలంటే, మహాభాగవతంలోని ప్రహ్లాద చరిత్ర, నృసింహావతారం, హిరణ్యకశిపుడి సంహారం ఘట్టం చదవాల్సిందే. రాక్షసరాజు హిరణ్యకశిపుడుకీ, లీలావతికీ జన్మించిన ప్రహ్లాదుడు పుట్టుకతోనే విష్ణుభక్తుడు. ప్రశ్నించే మనస్తత్వం అలవర్చుకున్న చిన్నవాడు. ఒకవిధంగా చెప్పాలంటే నిర్భయంగా కన్న తండ్రిని కూడా ఎదిరించే వ్యక్తిత్వం. తండ్రి మాటను గౌరవిస్తూ, రాక్షస గురువులు చెప్పినవన్నీ నేర్చుకున్నప్పటికీ విష్ణుభక్తి మాత్రం మానలేదు. హిరణ్యకశిపుడి మార్గానికి రాని కొడుకు ప్రహ్లాదుడుని రాక్షసులు చిత్రహింసలు పెట్టారు. అయినా ప్రహ్లాదుడిలో మార్పు రాలేదు. పైగా రహస్యంగా విష్ణుతత్వాన్ని వారికి బోధించాడు. తండ్రీ, కొడుకులకు మధ్య శ్రీహరి విషయంలో సంవాదం జరిగింది.

# బడ్జెట్‌లో కిసాన్ సమ్మాన్ నిధికి కేటాయింపులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న పూర్తి బడ్జెట్లో రైతులకు గుడ్ న్యూస్ రాబోతుంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద వార్షికంగా వచ్చే మొత్తం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. పలు వర్గాల సమాచారం ప్రకారం రైతులకు చెల్లించే వార్షిక మొత్తం రూ.6,000 నుంచి రూ.10,000 వరకు పెరుగుతుందని చెబుతున్నారు. దీంతో ఈ పథకంలో నమోదు చేసుకున్న రైతులందరూ దీని ప్రయోజనాన్ని పొందనున్నారు. బ్జడెట్ మొదటి రోజు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాన్ని ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. అయితే దీని గురించి అధికారికంగా ఎవరూ ప్రకటించలేదు. కానీ పెంచే ఛాన్స్ ఉందని అంటున్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి ఒక్కొక్కటి రూ. 2,000 చొప్పున మూడు వాయిదాలలో రూ. 6,000 అందిస్తుంది. ప్రతి వాయిదా చెల్లింపుల మధ్య నాలుగు నెలల అంతరం ఉంటుంది. తదుపరి విడత డబ్బును ఫిబ్రవరి మొదటి వారంలో విడుదల చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో బడ్జెట్లో ఈ మొత్తం పెంచిన తర్వాత, పెరిగిన మొత్తం చెల్లిస్తారా లేదా పాత వాయిదా వస్తుందా అని రైతులు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం రైతులకు పూర్తి ప్రయోజనం లభిస్తుంది. కెవైసి పూర్తి చేయని రైతులు ఈ పథకం ప్రయోజనాలు పొందలేరు. అయితే గతంలో రైతులు ఏడాదికి రూ. 6 వేలను మూడు వాయిదాలను పొందుతారు. ఇప్పుడు పెంచనున్న రూ.10 వేల మొత్తాన్ని మూడు వాయిదాలలో ఎలా చెల్లిస్తారని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ పథకం కింద అందించే మొత్తం రూ.10,000 అందిస్తే రైతులకు వ్యవసాయ పనులు, కూలీలకు, కరెంట్ సహా ఇతర ఖర్చులకు ఈ నిధులను ఉపయోగించుకోవచ్చు. ముఖ్యంగా చిన్న రైతులకు ఈ మొత్తం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ నిధులు రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పవచ్చు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2018 డిసెంబర్ 1న ప్రారంభించింది. ఈ పథకం కింద రైతులకు ఆర్థిక సహాయం అందించడం లక్ష్యంగా ఉంది.

# ఎన్నికల నిర్వహణ హామీ నిలబెట్టుకున్నమోడీ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లుగానే ప్రధాని మోడీ విజయవంతంగా ఎన్నికలు నిర్వహించారని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీని కొనియాడారు. మోదీ మూడోసారి ప్రధానిగా అధికారం చేపట్టిన తర్వాత శ్రీనగర్‌లో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. అప్పుడే కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రజలకు వాగ్దానం చేశారని అన్నారు. అన్నట్లుగానే నాలుగు నెలలలోపు జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యిందని పేర్కొన్నారు. దాని ఫలితంగానే నేడు తాను ముఖ్యమంత్రి పదవిలో ఉన్నానన్నారు. జమ్మూ కశ్మీర్ ఎన్నికల్లో అన్ని ప్రాంతాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారని.. ఎక్కడా రిగ్గింగ్, అధికార దుర్వినియోగం జరిగినట్లు ఫిర్యాదులు లేవని పేర్కొన్నారు. అదే విధంగా జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తానని ఇచ్చిన హామీని ప్రధాని త్వరలో నెరవేరుస్తారని నమ్ముతున్నానని అన్నారు. మళ్లీ భారత దేశంలోని ఒక రాష్ట్రంగా జమ్మూకశ్మీర్ అవతరిస్తుందని అన్నారు. ప్రధాని మోదీ కృషి వల్ల సరిహద్దుల్లో శాంతిభద్రతలు కొలిక్కి వచ్చాయని ఒమర్ అన్నారు. పర్యటకపరంగా కూడా కశ్మీర్ అభివృద్ధి చెందుతోందని తెలిపారు. శ్రీనగర్–లేహ్ జాతీయ రహదారిపై సోన్‌మార్గ్ ప్రాంతంలో నిర్మితమైన జడ్–మోడ్ సొరంగాన్ని నేడు ప్రధాని మోదీ ప్రారంభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సొరంగం ప్రారంభంతో ఎగువ ప్రాంతాల ప్రజలు ఇకపై మైదాన ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని.. ఏడాదిలో ఏ సీజన్‌లోనైనా లద్దాఖ్‌ను రహదారి మార్గం ద్వారా చేరుకోవడానికి వీలవుతుందని అన్నారు. దీనివల్ల సోన్‌మార్గ్‌కు పర్యటకుల రాక కూడా పెరగనుందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో జమ్మూకశ్మీర్‌లో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీ అక్కడి ప్రజల అభివృద్ధి కోసం పాటుపడతానని హామీ ఇచ్చారు. జమ్మూకశ్మీర్‌ను మళ్లీ రాష్ట్రంగా మారుస్తామని అన్నారు. కశ్మీర్ యువత చేతిలో రాళ్లను వదిలేసి విద్య, అభివృద్ధి వైపు వెళ్లాలని ఎదురు చూస్తున్నారని అన్నారు.

# బంగ్లా సరిహద్దుల్లో కొనసాగుతున్న ఉద్రిక్తత

న్యూఢిల్లీ,సరిహద్దు ఉద్రిక్తతల మధ్య, బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జాషిమ్ ఉద్దీన్ భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మను కలిశారు. ఈ సమయంలో సరిహద్దులో ఉద్రిక్తత గురించి ఇద్దరూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇద్దరి మధ్య సమావేశం దాదాపు 45 నిమిషాల పాటు కొనసాగింది. నిజానికి, షేక్ హసీనా ప్రభుత్వాన్ని బంగ్లాదేశ్ నుండి తొలగించిన తర్వాత, రెండు దేశాల మధ్య ఉద్రిక్తత కనిపించింది. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలు హింసకు గురవుతున్నారు. వారిని క్రూరంగా హింసిస్తున్నారు. భారతదేశం దాని గురించి కఠినంగా ఉంది. ఇప్పుడు బంగ్లాదేశ్ సరిహద్దు నుండి కూడా చొరబాట్లు ప్రారంభమయ్యాయి. ఇటీవల బీఎస్ఎఫ్ చాలా మంది స్మగ్లర్లను పట్టుకుంది. సరిహద్దు వద్ద భద్రతా ఉల్లంఘనలను నివారించడానికి, బీఎస్ఎఫ్ సరిహద్దులో ముళ్ల తీగలను ఉపయోగిస్తోంది. బిఎస్ఎఫ్ చాలా కాలంగా ఈ పని చేస్తోంది. దీనిపై బంగ్లాదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. భారతదేశం ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని మరియు భారతదేశం–బంగ్లాదేశ్ సరిహద్దులో ఐదు చోట్ల ముళ్ల తీగలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తోందని బంగ్లాదేశ్ తెలిపింది. సరిహద్దులో భారతదేశం కంచె వేయడం అనధికారికం. ఇలాంటి కార్యకలాపాలు ద్వైపాక్షిక సంబంధాలకు హాని కలిగిస్తాయని బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జాషిం ఉద్దీన్ అన్నారు. ఈ సమావేశానికి ముందు బంగ్లాదేశ్ భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మను పిలిపించినట్లు వార్తలు వచ్చాయి. కానీ తరువాత సరిహద్దులో కొనసాగుతున్న ఉద్రిక్తత గురించి చర్చించడానికి అతన్ని పిలిచారని వార్తలు వచ్చాయి. బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శిని కలిసిన తర్వాత, భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మ మీడియాతో మాట్లాడుతూ.. నేను విదేశాంగ కార్యదర్శిని కలిశాను. సరిహద్దు నేరాలను రహితంగా చేయడం, నేరస్థుల కదలికలను ఆపడం, మానవ అక్రమ రవాణా సవాళ్లను ఎదుర్కోవడం వంటి అంశాలపై చర్చించాను. సరిహద్దులో ముళ్ల తీగల ఏర్పాటుకు సంబంధించి మా మధ్య పరస్పర ఒప్పందం ఉందని ఆయన అన్నారు. ఈ విషయంలో బీఎస్ఎఫ్, బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ మధ్య చర్చలు జరుగుతున్నాయి. పరస్పర ఒప్పందం అమలు అవుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇంతలో బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జాషిమ్ ఉద్దీన్ మాట్లాడుతూ.. భారత అధికారులు ఎటువంటి రెచ్చగొట్టే ప్రకటనలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండండి. ఎందుకంటే ఇది ఉమ్మడి సరిహద్దు వెంబడి ఉద్రిక్తతలను పెంచుతుంది.

# కమలనాథుల పసుపు ప్లానింగ్ మామూలుగా లేదుగా?



హైదరాబాద్,ఏమాటకు ఆ మాటే చెప్పాలి.. భారతీయ జనతాపార్టీకి దేశ ప్రధాని నరేంద్ర మోడీ అన్నీ తానై అయినప్పటి నుంచి ఆ పార్టీ తీరులో మార్పు కొట్టొచ్చినట్లుగా ఉండేది. బీజేపీని చూస్తే.. మోడీకి ముందు, మోడీ తర్వాత అన్న విభజన రేఖ స్పష్టంగా గీయాల్సి ఉంటుంది. అంతలా పార్టీని ప్రభావితం చేశారు. మిగిలిన బీజేపీ అగ్రనేతలకు.. మోడీకి ఉన్న వ్యత్యాసం ఏమంటే.. అధికారంలోకి రావటం కోసం.. బీజేపీని.. దాని భావజాలాన్ని దేశ వ్యాప్తం చేసేందుకు ప్రయత్నిస్తే.. మోడీ మాత్రం అధికారంలోకి రావటమే కాదు.. ఆ పవర్ మరొకరి చేతికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవటమే కాదు.. ప్రత్యర్థి పార్టీలు అంతకంతకూ బలహీనం అయ్యేలా చేసే టాలెంట్ ఆయనలో పుష్కలంగా కనిపిస్తుంది.పదేళ్లు నాన్ స్టాప్ అధికారాన్ని అనుభవించిన ఆయన.. మరో ఐదేళ్ల అధికారానికి గత ఏడాది మేలో మరోసారి దేశ ప్రజల నుంచి అధికారికంగా అనుమతి తీసుకోవటం తెలిసిందే. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆయన్ను కాదనే దమ్ము..ధైర్యం బీజేపీ మొత్తంలో ఎవరికి లేదు. ఆయన తీరుకు తగ్గట్లే బీజేపీ రూపురేఖలు మారిపోయాయి. ఎన్నికలే లక్ష్యంగా మోడీ ఆలోచనలు ఉంటాయని చెబుతారు. ఏదైనా రాష్ట్రం మీద ఆయన ఫోకస్ పెడితే.. అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగటానికి ఏడాది ముందు నుంచి అలెర్టు కావటం.. ఎప్పుడూ లేని విధంగా మొదటి ఆర్నెల్లలోనే పలుమార్లు సదరు రాష్ట్రానికి వెళ్లటం.. అక్కడి పార్టీని యాక్టివ్ చేయటం.. ఎన్నికలు రావటానికి చివరి ఆర్నెల్లలో అధికారాన్ని హస్తగతం చేసుకోవటానికి వేయాల్సిన ఎత్తులు వేస్తుంటారు.ఇక్కడే మోడీలోని మరో ఆసక్తికరమైన వైరుధ్యాన్ని చెప్పాలి. ఎన్నికల వేళలో ఎంత నమ్మకంగా మాట ఇస్తారో.. తిరుగు లేని అధికారం చేతికి వస్తే మాత్రం ఆ హామీని తూచ్ అనటం ఆయనకే సాధ్యం. ఈ సందర్భంగా ఆయన ఎంతో కటువుగా వ్యవహరిస్తారు. ఏపీకి ప్రత్యేక హోదా అంశాన్ని కావొచ్చు.. తెలంగాణకు పసుపు బోర్డు అంశాన్ని ఉదాహరణగా చెప్పొచ్చు. పసుపు బోర్డు అంశంపై గత ప్రభుత్వం మోడీ సర్కారు ఎంత కఠినంగా వ్యవహరించిందో తెలిసిందే.అయితే..ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికల వేళ.. పసుపు బోర్డు ఏర్పాటు అవశ్యకత అర్థం చేసుకున్న మోడీ.. అందుకు సరైన సమయాన్ని చూడటం కనిపిస్తుంది. నిజామాబాద్ జిల్లా రైతుల చిరకాల వాంఛ అయిన పసుపు బోర్డును ఏర్పాటు చేస్తున్న విషయాన్ని సోమవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో (2023, అక్టోబరు 1న మహబూబ్ నగర్ లో జరిగిన ప్రచార సభలో) పసుపుబోర్డు హామీని అమలు చేయనున్నట్లుగా పేర్కొన్నప్పటికి.. అది వాస్తవ రూపంలోకి రావటానికి 16 నెలల టైం పట్టింది.ఇంత ఆలస్యమైన ఈ వ్యవహారం సరిగ్గా ఇప్పుడే ఎందుకు ప్రకటించినట్లు? అన్న ప్రశ్న వేసుకోవటంతో పాటు.. దాని లోతుల్లోకి వెళితే.. మోడీ మాష్టారి మాస్టర్ ప్లాన్ అర్థమవుతుంది. ఆయన లోతుకు ఆశ్చర్యపోవాల్సిందే. గతంలో పసుపు బోర్డు ఏర్పాటు చేయనున్నట్లుగా కేంద్రం ప్రకటించినప్పటికీ.. అదెక్కడ ఏర్పాటు చేస్తారో మాత్రం చెప్పలేదు. తాజాగా మాత్రం దానిని నిజామాబాద్ లో ఏర్పాటు చేయనున్నట్లుగా ప్రకటించటమే కాదు.. దాని ఛైర్మన్ గా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి బీజేపీ నాయకుడు పల్లె గంగారెడ్డిని నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులను కేంద్ర వాణిజ్య శాఖ జారీ చేసింది.ఇంతకూ నిజామాబాద్ లో పసుపు బోర్డును ఏర్పాటు చేయటానికి.. అదే జిల్లాకు చెందిన వ్యక్తిని పసుపు బోర్డు ఛైర్మన్ గా నియమించటం వెనుక లెక్కలు ఏమైనా ఉన్నాయా? అంటే.. ఎందుకు ఉండవు? అన్న సమాధానం ప్రశ్న రూపంలో రావటం ఖాయం. మరికొద్ది రోజుల్లో తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ రెండు ఎన్నికల్ని చూస్తే. ఒకటి కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ జిల్లాలకు సంబంధించి పట్టభద్రుల స్థానానికి ఎన్నిక జరగనుంది. మరో ఎన్నికల కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది.నిజానికి మిగిలిన ఎన్నికలకు.. ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో బీజేపీ ఫార్మాట్ వేరుగా ఉంటుందని చెప్పాలి. ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే వేళలో.. అధికారంలో ఏ పార్టీ ఉన్నప్పటికీ.. దానితో ముఖాముఖిన పోరాడే సత్తా.. బీజేపీకి మాత్రమే సొంతమని చెప్పాలి. నిజానికి ఆ పార్టీకి బలం లేకున్నా.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం తన మార్కును చూపించటం తెలిసిందే.తాజా పసుపుబోర్డు నిజామాబాద్ లో ఎంపిక చేయటం ద్వారా.. తాజాగా జరుగుతన్న ఎమ్మెల్సీ ఎన్నికల మీద ప్రభావం చూపుతుందని చెప్పాలి. చిరకాల వాంఛ తీర్చిన ఘనత బీజేపీకి దక్కటంతోపాటు.. దానికి పేబాక్ గా ఓట్ల రూపంలో గెలిపించాల్సిన బాధ్యత ఆ జిల్లాలకు చెందిన వారి మీద ఉంటుంది. గురి చూసి దెబ్బేసిన చందంగా.. మోడీ అండ్ కో పసుపుబోర్డును నిజామాబాద్ లో ఏర్పాటు చేయటం వెనుక ఇంత భారీప్లానింగ్ ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మోడీనా మజాకానా.

# రేవంత్ సర్కార్‌కు జనవరి 26 గుబులు..!

హైదరాబాద్,అంత అన్నాం. ఇంత అన్నాం. ఎంతో గొప్పగా ఓ డేట్ కూడా అనౌన్స్ చేశాం. టైమ్ దగ్గర పడుతోంది. ఇంకో 12 రోజులే ఉంది. ఇప్పుడెలా అని ఆలోచనలో పడిందట కాంగ్రెస్ సర్కార్. అమ్మో 26 జనవరి అని టెన్షన్ పడుతోందట. రైతు భరోసా, రైతు కూలీలకు సాయం, ఇందిరమ్మ ఇల్లు.. తర్వాత నాలుగు రోజులకే జీతాలు-పెన్షన్లు. ఇవన్నీ గుర్తొస్తేనే ఇప్పుడెట్లా? ఏమి చేసేదని థింక్ చేస్తున్నారట కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు. జనవరి 26 నాటికి ఖజానా నిండుతుందా లేదా అన్న డైలమాలో ఉన్నారట. ఇంతకీ తెలంగాణ సర్కార్‌లో గుబులు ఎందుకు? పది రోజుల్లో 20వేల కోట్లు సమకూరేదెట్లా.?

**ఆ మూడు పథకాలకు వేల కోట్ల రూపాయలు అవసరం..!**

26 జనవరి. ఈ డేట్ గుర్తొస్తేనే కంగారు పడుతోందట కాంగ్రెస్ సర్కార్. గణతంత్ర్య దినోత్సవం, రాజ్యాంగం అమలైన రోజైన జనవరి 26 నుంచి పలు కీలక పథకాలను అమలు చేస్తామని ప్రకటించారు సీఎం రేవంత్ రెడ్డి. రైతు భరోసా, ఇందిరమ్మ రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మూడు పథకాలకు వేల కోట్ల రూపాయలు అవసరం ఉండగా ప్రభుత్వ ఖజానాలో మాత్రం అంత డబ్బు లేదట.కాంగ్రెస్ హామీ ఇచ్చిన గ్యారెంటీల అమలుతో పాటు ఉద్యోగుల జీతాలు-పెన్షన్లు, రోటీన్‌గా జరిగి అభివృద్ధి సంక్షేమ పథకాలకే నిధులు సరిపోవడం లేదట. పైగా గత ప్రభుత్వాలు చేసిన అప్పులకు వడ్డీలు, నెలవారి వాయిదాలు చెల్లించే సరికే కాంగ్రెస్ సర్కార్‌కు తలప్రాణం తోకకు వస్తోందట.

**దాదాపు 8,400 కోట్ల రూపాయలు అవసరం అవుతాయని అంచనా..**

రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు ఏడాదికి 12 వేల రూపాయలను ఇస్తామని ప్రకటించింది కాంగ్రెస్ ప్రభుత్వం. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలాగా భూములన్నింటికీ కాకుండా వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా ఇస్తామంటున్నారు. ఆ లెక్కన చూసుకున్నా తెలంగాణలో దాదాపు కోటీ 40లక్షల ఎకరాల భూములు వ్యవసాయ యోగ్యంగా ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.అంటే రైతు భరోసా మొదటి విడత జనవరి 26 ప్రారంభిస్తే ఎకరానికి 6 వేల రూపాయల చొప్పున దాదాపు కోటీ 40లక్షల ఎకరాలకు దాదాపు 8,400 కోట్ల రూపాయలు అవసరం అవుతాయని వ్యవసాయ శాఖ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.ఇక జనవరి 26 నుంచి భూమి లేని వ్యవసాయ రైతు కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయల చొప్పున ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణలో మొత్తం 1.16 కోట్ల కుటుంబాలు ఉన్నాయని నిర్వహించిన ఇంటింటి సర్వేలో తేలింది. వీరిలో నిరుపేదలను గుర్తించేందుకు జాతీయ ఉపాధి హామీ కూలీ గుర్తింపు కార్డును ప్రాతిపదికగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**1,320 కోట్ల రూపాయలు అవసరం అవుతాయి..**

తెలంగాణలో మొత్తం 53 లక్షల మందికి ఉపాధి హామీ గుర్తింపు కార్డులున్నా, వారిలో 32 లక్షల మంది మాత్రమే రోజూ కూలీ పనులకు వెళ్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయట. ఈ కార్డుదారుల్లో దాదాపు 22 లక్షల మందికి భూమి లేదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీరికి రైతు భరోసా కింద మొదటి విడతలో 6వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తే 1,320 కోట్ల రూపాయలు అవసరం అవుతాయి.రైతు కూలీలను అర్హులుగా గుర్తించే విషయంలో డైలమాలో ఉందట సర్కార్. ఉపాధి హామీ కూలీల్లో సగం మందిని తప్పిస్తే వారిలో వ్యతిరేకత వస్తుందని, దాని ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై పడుతుందని రేవంత్ సర్కార్ భావిస్తోందట. ప్రస్తుతం ఉపాధి హామీ కూలీలుగా ఉన్న రైతు కూలీలు



46 లక్షల మందికి ఏడాదికి 12 వేల చొప్పున చెల్లిస్తే 5వేల 200 కోట్లు అవసరం అవుతాయి. అంటే మొదటి విడతలో 6వేల చొప్పున ఇచ్చి 2వేల 600 కోట్లు కావాలి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఇంత పెద్ద మొత్తంలో నిధులను చెల్లించే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం లేదంటున్నారు అధికారులు.

**ఇందిరమ్మ ఇళ్ల కోసం 84 లక్షల మంది దరఖాస్తు..**

ఇక జనవరి నెలాఖరు నుంచి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం చేస్తామంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం తెలంగాణలో దాదాపు 84 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**దాదాపు 20 వేల కోట్ల రూపాయలు అవసరం..**

ఒక్కో ఇందిరమ్మ ఇంటికి ఐదు లక్షల ఆర్థిక సాయంలో భాగంగా మొదటి విడతలో లక్ష రూపాయల చొప్పున చెల్లించినా 5 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయి. అంటే రైతు భరోసాకు 8వేల 400 కోట్లు, రైతు కూలీలకు 1,320 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లకు 5వేల కోట్లు..మొత్తం కలిపి దాదాపు 15 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయి. ఇక జవనరి 26 తర్వాత నాలుగు రోజులకే ఫిబ్రవరి 1న ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు మరో 4వేల 500 వేల కోట్లు కావాలి. అంటే తెలంగాణ సర్కార్‌కు ప్రస్తుతం దాదాపు 20 వేల కోట్ల రూపాయలు అవసరం.

**ప్రజల్లో నమ్మకం పోతుందని, ప్రతిపక్షాలకు అస్త్రంగా మారతామనే ఆందోళన..**

ఇక రోటీన్‌గా జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కూడా డబ్బులు కావాల్సిందే. అందుకే జనవరి 26 వస్తోందంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం కంగారు పడుతోందట. ఈ నేపథ్యంలోనే ఖజానాను నింపుకునేందుకు ఉన్న అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి.ఏడాది కాలంగా నానుతూ వస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను జనవరి 26న ప్రారంభించకపోతే ఇటు ప్రజల్లో నమ్మకం కోల్పోవడంతో పాటు, ప్రతిపక్షాలకు అస్త్రంగా మారుతామని రేవంత్ సర్కార్ ఆందోళన చెందుతోందట.ఎలాగైనా ఖజానాకు 20 వేల కోట్ల రూపాయలను జమచేసి మాటిచ్చినట్లు ఆయా పథకాలను అమలు చేసి తీరాల్సిందేనన్న పట్టుదలతో ఉన్నారట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. మరి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను సమీకరించి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందా లేదా తెలియాలంటే జనవరి 26వరకు వెయిట్ చేయాల్సిందే.

# కేటీఆర్ చేతికి కారు స్టీరింగ్..?

హైదరాబాద్,ఫార్ములా ఈ రేస్ ను హైదరాబాద్ కు తీసుకొచ్చారన్న పేరు సంగతేమో కానీ.. ఆ రేసులో అవినీతి జరిగిందంటూ కేసును ఎదుర్కొంటున్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్. తెలంగాణలో ప్రభుత్వం ఉన్న దాదాపు పదేళ్లు కేటీఆర్ మాట బాగా చెల్లింది. అయితే, అధికారం ఎప్పటికీ శాశ్వత కాదు కదా..? 2023 చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ గెలుపుతో బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్రకు పరిమితం అయింది. అప్పటినుంచి కేసీఆర్ పార్టీకి కష్టాలు మొదలయ్యాయి.బీఆర్ఎస్ (టీఆర్ఎస్) చరిత్రలో తొలిసారిగా లోక్ సభ ఎన్నికల్లో ఒక్క సీటూ గెలవకుండా సున్నాకు పరిమితమైంది. దీనికితోడు పార్టీ నుంచి గెలిచిన 37 మంది ఎమ్మెల్యేల్లో 10 మంది వరకు కాంగ్రెస్ లో కి జంప్ అయ్యారు. కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఢిల్లీ మద్యం స్కాంలో తిహాడ్ జైలుకు వెళ్లారు. బీఆర్ఎస్ కు ఈ కష్టాలకు తోడు కేటీఆర్ పై 'కారు' కేసు నమోదైంది.పార్టీ, నాయకత్వం పరంగా ఇంత జరుగుతున్నా అధినేత కేసీఆర్ మాత్రం బయటకు వచ్చి మాట్లాడడం లేదు. ఫాం హౌజ్ నుంచే ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తున్నారా? అన్నది కూడా తెలియడం లేదు. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ అంతా తానే అయి భారం మోస్తున్నారు.ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయికి వెళ్తున్న కేటీఆర్.. ప్రభుత్వ పథకాల అమలులో లోపాలను తీవ్రంగా ఎండగడుతున్నారు. మరోవైపు పార్టీ పరంగానూ ఆయన పాత్ర ప్రస్తుతం చర్చనీయం అవుతోంది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పగ్గాలు కేటీఆర్ చేతికి రానున్నట్లు తెలుస్తోంది.పార్టీ తరఫున ఇప్పటికే అన్ని కార్యక్రమాలు కేటీఆర్ చేతుల మీదుగా జరుగుతున్నాయి. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని సైతం ఆయన గట్టిగా నిలదీస్తున్నారు. తనపై వచ్చిన ఆరోపణల మీద కూడా సమర్థంగా స్పందిస్తున్నారు. మరీ ముఖ్యంగా గత మూడు నెలల్లో జరిగిన పరిణామాలు కేటీఆర్ గ్రాఫ్ ను పెంచాయని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. దీంతో ఆయన చుట్టూ.. పార్టీ పగ్గాల అప్పగింత చర్చ



జోరుగా సాగుతోంది.ఇదివరకు పార్టీ చీఫ్ గా మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు హరీశ్ రావు ముందుగా వినిపించేది. ఆయన ఉద్యమ నేపథ్యం, నాయకత్వ శైలిని దీనికి సపోర్టింగ్ గా చూపేవారు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా కేటీఆర్ వైపు మొగ్గినట్లు బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. హైడ్రా, ఫార్ములా ఈ-రేస్ వంటి విషయాల్లో కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డి నువ్వానేనా అన్నట్లు దూకుడు చూపారు. ఇదే కేటీఆర్ కు మేలు చేసిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే ఆయనకే పార్టీ పగ్గాలు దక్కుతాయని నిజామాబాద్ కు చెందిన కీలక నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు.

**ఆ పండుగ నాటికి..**

కేసీఆర్ టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చింది దసరా నాడు. దాని ఫలితం ఎలా ఉన్నా.. ఆయన పార్టీ పగ్గాలను వచ్చే దసరా నాటికి కేటీఆర్ కు అప్పగిస్తారని అంటున్నారు. పైగా తెలంగాణలో దసరా పెద్ద పండుగ. సెంటిమెంట్ గానూ దీనిని ముహూర్తంగా నిర్ణయించుకున్నట్లు సమాచారం.

# అత్యాచార కేసులో హర్యానా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



హర్యానా: హర్యానా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ లాల్ బడోలీ, సింగర్ రాకీ మిట్టల్‌పై అత్యాచారం కేసు నమోదైంది. ఢిల్లీకి చెందిన ఓ యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఘటన 2023 జులై 3న జరిగినట్లు యువతి పేర్కొంది. నిందితులపై 376డి, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సోలన్ ఎస్పీ గౌరవ్ సింగ్ తెలిపారు.హర్యానా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ లాల్ బడోలీపై ఓ మహిళ సంచలన ఆరోపణ చేసింది. ప్రముఖ గాయకుడు రాకీ మిట్టల్‌తో కలిసి తనపై అఘాయిత్యానికి పాల్పడ్డారని పేర్కొంది. ఈమేరకు హిమాచల్ ప్రదేశ్‌లోని కసౌలీ పోలీస్ స్టేషన్‌లో వారిద్దరిపై అత్యాచారం కేసు నమోదైంది. ఎఫ్ఐఆర్ ప్రకారం, అత్యాచార ఘటన జూలై 7, 2023న జరగగా, ఎఫ్ఐఆర్ డిసెంబర్ 13, 2024న నమోదైంది.కసౌలి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో, జూలై 3, 2023న ఇద్దరు స్నేహితులతో కలిసి హిమాచల్‌ను సందర్శించడానికి వచ్చినట్లు మహిళ ఫిర్యాదులో పేర్కొంది. ఆమె బస చేసిన హోటల్‌లో మోహన్ లాల్ బడోలీ, రాకీ మిట్టల్ కూడా ఉన్నారు. సాయంత్రం 7 గంటలకు బయటకు వెళుతుండగా, మోహన్ లాల్ బడోలీ తనను తాను గొప్ప రాజకీయ నాయకుడిగా, రాకీ మిట్టల్ గొప్ప గాయకుడిగా పేర్కొన్నారు. అనంతరం మహిళలిద్దరినీ తన గదిలోకి తీసుకెళ్లి మద్యం తాగించారని మహిళ ఆరోపించింది.బడోలి, మిట్టల్ కూడా తన అసభ్యకరమైన ఫోటోలు, వీడియోలు తీశారని ఆ మహిళ ఆరోపించింది. అలాగే బయటకు వెళ్లేటప్పుడు నోరు విప్పితే చంపేస్తామని, ఈ ఫొటోలు, వీడియోలు వైరల్ చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని సదరు మహిళ పేర్కొంది. అనంతరం మద్యం తాగించి అఘాయిత్యానికి పాల్పడ్డట్లు తెలిపింది. మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హిమాచల్ పోలీసులు మోహన్ లాల్ బడోలి, రాకీ మిట్టల్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఈ విషయంలో మోహన్ లాల్ బడోలీ, రాకీ మిట్టల్ స్పందించలేదు. కాగా, ఇంతవరకు ఎవరినీ అరెస్టు చేయలేదని, విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.మోహన్ లాల్ బడోలి హర్యానా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గతంలో సోనిపట్ జిల్లా రాయ్ స్థానం నుండి బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోహన్ లాల్ బడోలీకి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. అతని నాయకత్వంలో, ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, బీజేపీ మూడవసారి హర్యానాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత మోహన్ లాల్ బడోలీ కూడా చాలా ప్రశంసలు పొందారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మోహన్ లాల్ బడోలీ పదవీకాలం మరోసారి పొడిగిస్తారని భావించారు. కానీ అత్యాచారం వంటి తీవ్రమైన ఆరోపణలతో, అతని ఇమేజ్ ఇప్పుడు పెద్ద దెబ్బ తగిలింది. ఇక, రాకీ మిట్టల్ గాయకుడు, నటుడు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు, రాకీ మిట్టల్ కాంగ్రెస్ గూటికి చేరారు. ఆ తర్వాత హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో రాకీ మిట్టల్ కాంగ్రెస్ నేతల తరఫున ప్రచారం చేశారు.

# ఇండియా కూటమిపై శరద్ పవార్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,ఇండియా కూటమిపై సీనియర్ రాజకీయ వేత్త, ఎన్‌సీపీ(ఎస్‌పీ) అధినేత శరద్ పవార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కూటమి కేవలం జాతీయ ఎన్నికల కోసమే ఉందని.. రాష్ట్ర, స్థానిక ఎన్నికల కోసం కాదని..దీనిపై ఎప్పుడూ చర్చ జరగలేదన్నారు. ఇటీవల శివసేన (యూబీటీ) కీలక నిర్ణయం తీసుకుంది. మహారాష్ట్రలో జరిగే స్థానిక ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తున్నట్లు వెల్లడించింది. తాజాగా శరద్ పవార్ వ్యాఖ్యలు మరింత బలం చేకూర్చాయి. స్థానిక ఎన్నికలపై ఎప్పుడూ చర్చ జరగలేదని.. మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలా? వద్దా? అనేది 8-10 రోజుల్లో సమావేశమై నిర్ణయం తీసుకుంటామన్నారు. తాజాగా శరద్ పవార్ వ్యాఖ్యలతో ఇండియా కూటమి పనైపోయిందని అర్థమవుతోంది. ప్రస్తుతం దాని ఉనికి ప్రశ్నార్థకమేనని స్పష్టం అవుతోంది.ప్రస్తుతం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆప్, కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తున్నాయి. ఈ రెండు కూడా ఇండియా కూటమిలో భాగంగా ఉన్నాయి. కానీ హర్యానాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల దగ్గర నుంచి రెండు పార్టీల మధ్య చీలికలు ఏర్పడ్డాయి. విడివిడిగా పోటీ చేసి పరాజయాన్ని మూటగట్టుకున్నాయి. ప్రస్తుతం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఎవరికి వారే సింగిల్‌గా బరిలోకి దిగాయి. అంతేకాకుండా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నాయి. దీంతో ఇండియా కూటమి ప్రస్తుతం మనుగడలో లేదని తెలుస్తోంది.ఇటీవల ఇండియా కూటమిలోని పార్టీల నేతలు బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇటీవల ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ.. ఇండియా కూటమి కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమేనని స్పష్టం చేశారు. అలాగే జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కూడా అదే రీతిగా వ్యాఖ్యలు చేశారు. అలాగే శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ మాట్లాడుతూ.. ఇండియా కూటమి కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే ఉందని.. ఓడిపోగానే ఒక్క రివ్యూ కూడా జరగలేదని తెలిపారు.ఇక దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ నేతలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటున్నారు. విమర్శలు-ప్రతివిమర్శలతో మాటల యుద్ధం నడుస్తోంది. హస్తిన ఎన్నికలు ఫిబ్రవరి 5న జరగనున్నాయి. ఎన్నికల ఫలితాలు మాత్రం ఫిబ్రవరి 8న విడుదల కానున్నాయి. ఇక్కడ ఆప్, కాంగ్రెస్, బీజేపీ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది.

# కేజ్రీవాల్‌కు బిగ్ షాక్.. ఆ కేసులో విచారణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ, ఢిల్లీ లిక్కర్ స్కామ్ కు సంబంధించి మనీ లాండరింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు కేంద్ర ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చింది.కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను విచారించేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈడీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రజా ప్రతినిధుల్ని విచారించేందుకు ఈడీ ముందస్తు పర్మిషన్ పొందాలని సుప్రీంకోర్టు గత నవంబర్‌లో ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తాజాగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా కేజ్రీవాల్‌ను విచారణ చేసేందుకు ఓకే చెప్పడంతో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ పరిణామం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.అయితే, 2021-22కి సంబంధించి ఢిల్లీ ఎక్సైజ్ పాలసీలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై అరవింద్ కేజ్రీవాల్‌పై కేసు నమోదైంది. మనీలాండరింగ్ కేసుకు సంబంధించి 2024 మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయగా.. 6 నెలల పాటు తీహార్ జైలులో శిక్ష అనుభవించిన తర్వాత 2024 సెప్టెంబర్లో అతడికి సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. బెయిల్ పొందిన కొద్ది రోజులకే, కేజ్రీవాల్ ఢిల్లీ సీఎం పదవికీ రాజీనామా చేశారు. అతడి స్థానంలో అతిషి మార్లెనా సింగ్



ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.కాగా, ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ నియోజవర్గాలకు ఫిబ్రవరి 5వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు, తుది ఫలితాలను ఈసీ ప్రకటించనుంది. ఈ ఎన్నికల్లో గెలిచేందుకు అధికార, విపక్ష పార్టీలు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్, బీజేపీ మధ్య గట్టి పోటీ నెలకొంది. 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ 62 సీట్లలో విజయం సాధించగా.. బీజేపీ కేవలం 8

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com